www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 181 | మంగళవారం 25.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# కుట్రతోనే అడ్డుకున్నారు..

పర్యటనను అడ్డుకోగలరు.. నా ఆలోచనను కాదు

## గుజరాత్ ఆధిపత్యాన్ని సహించేది లేదు

### పార్లమెంట్‌లో పంచాయితీ ఖాయం

కొండా సురేఖ ఎపిసోడ్‌పై రేవంత్ క్లారిటీ.. కీలక వ్యాఖ్యలు..



- రేవంత్ విదేశీ పర్యటనకు కేంద్రం నో.. సీఎం ఫైర్
- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం
- లండన్‌కు ఓకే.. అమెరికాకు నో ఎందుకు?
- విదేశీ పర్యటన అడ్డుకోవడంపై కేంద్రంపై రేవంత్ ఫైర్
- కేంద్ర నిర్ణయం తెలంగాణకు అవమానం
- పెట్టుబడుల కోసం వెళ్తే అడ్డుకుంటారా?
- రేవంత్ అమెరికా టూర్‌కు బ్రేక్.. కేంద్రంపై తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం రాజకీయాలు చేస్తోంది
- నా పర్యటనను అడ్డుకోగలరు.. నా ఆలోచనను కాదు
- కేంద్ర వైఖరిపై పార్లమెంట్‌లో పంచాయితీ ఖాయం 02
- ఫెడరల్ స్ఫూర్తిపై కేంద్రం దెబ్బకొట్టింది
- తెలంగాణకు అన్యాయం.. కేంద్రంపై రేవంత్ తీవ్ర ఆరోపణలు
- గుజరాత్‌కు ఒక న్యాయం.. తెలంగాణకు మరో న్యాయమా?
- విదేశీ పెట్టుబడుల కోసం వెళ్తే అడ్డంకులా?
- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న గుజరాత్ నాయకత్వం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ అభివృద్ధి, విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా తాను తలపెట్టిన విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్‌లో భాగస్వామ్యమవుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటే, కేంద్రం రాజకీయ కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

**విదేశీ పర్యటన ఉద్దేశం.. విద్య, పెట్టుబడులే మా లక్ష్యం**

రాష్ట్రాల కలయికతోనే కేంద్రం ఏర్పడుతుందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ రైజింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో విద్య, క్రీడలు, పారిశ్రామిక రంగానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గాంధీ, అంబేద్కర్ లాంటి మహానీయులు చదువుకున్న ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను తెలంగాణకు...

# ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు

భూ వివాదాల వెనుక గత ప్రభుత్వ నిర్ణయాలే కారణమా?

సీఎస్ 7, సీఎస్ 14 భూములపై 'సిట్' విచారణకు సిద్ధం



### దొంగ జీవోలపై ఎఫ్ఐఆర్‌లు.. పొంగులేటి వార్నింగ్

### యుఎల్‌సీ, భూదాన్ భూములకు కొత్త పాలసీ

- భూ సమస్యలపై గత ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన పొంగులేటి
- ధరణి భూ సమస్యలకు కారణం గత ప్రభుత్వమే
- భూముల వ్యవహారంలో గత పాలకుల తప్పిదాలపై పొంగులేటి ఫోకస్
- 22ఏ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- భూములపై ప్రతిపక్షాల ఆరోపణలకు గణాంకాలతో సమాధానం 03

# కొండా చేరికపై కీలక వ్యాఖ్యలు

## మంచి బాధ్యత ఇస్తారేమో?

- సురేఖ బీజేపీలోకి రావాలా? నిర్ణయం పార్టీదే: డీకే అరుణ
- కొండా సురేఖ భవిష్యత్తుపై తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ
- సురేఖ బీజేపీలో చేరికపై క్లారిటీ ఇచ్చిన డీకే అరుణ
- ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే.. డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు 03






# స్టే ఎత్తివేత.. కానీ..!

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు
- దివ్యాంగులకు స్టే ఎత్తివేత.. మిగతా వారికి కొనసాగింపు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులపై హైకోర్టు క్లారిటీ
- దివ్యాంగ లబ్ధిదారులకు ఆర్థిక సాయం పునరుద్ధరణ
- ప్రభుత్వానికి రెండు వారాల గడువు.. హైకోర్టు కీలక ఆదేశం
- కల్యాణలక్ష్మి పథకంపై హైకోర్టు తాజా నిర్ణయం
- షాదీ ముబారక్ నిధులపై హైకోర్టు కీలక తీర్పు 02

# స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి

## రైతులు ఫుడ్ ప్రాసెసింగ్‌లోకి రావాలి..

- పాప్‌కార్న్ హబ్‌గా ముసునూరు.. చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- ప్రపంచానికి ఏపీ పాప్‌కార్న్.. చంద్రబాబు లక్ష్యం
- నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనం ఆవిష్కరణ
- ముసునూరు నుంచి ప్రపంచ మార్కెట్‌కు పాప్‌కార్న్
- వ్యవసాయంలో ఆవిష్కరణలే లక్ష్యం.. చంద్రబాబు 02

### పాప్‌కార్న్ విత్తనంతో ఏపీకి కొత్త గుర్తింపు




# నీ పద్ధతి మార్చుకో రేవంత్ రెడ్డి

- ఫీజు బకాయిలపై బీజేపీ దీక్షకు ఆర్.కృష్ణయ్య మద్దతు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉద్యమం రేవంత్ అధికారానికి సవాల్: కృష్ణయ్య
- కాంట్రాక్టర్లకు నిధులున్నాయి.. విద్యార్థుల ఫీజులకు లేవా? 03




# అసెంబ్లీ రేసులో తీన్మార్ మల్లన్న..

- తన సొంత నియోజకవర్గం ఆలేరు నుంచే పోటీ: మల్లన్న
- ఎమ్మెల్సీ నుంచి ఎమ్మెల్యేగా? తీన్మార్ మల్లన్న కీలక ప్రకటన
- సెప్టెంబర్ 15 నుంచి మల్లన్న పాదయాత్ర.. కీలక ప్రకటన 02



# అసెంబ్లీలో విజయ్ 'సూపర్ సిక్స్'!

- తమిళనాడులో విజయ్ కీలక సంక్షేమ పథకాల ప్రకటన
- మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం
- పేద కుటుంబాలకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
- విజయ్ 'సూపర్ సిక్స్'.. మహిళలు, పేదలకు భారీ వరాలు 05
- పరందూర్ ఎయిర్‌పోర్ట్ రద్దు.. విజయ్ సంచలన నిర్ణయం



# లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్

## జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా 121 మద్యం బ్రాండ్లకు అనుమతా?: హరీశ్ రావు

### ఉద్యోగాల కంటే మద్యం బ్రాండ్లపైనే శ్రద్ధా?

- జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్
- ఉద్యోగాల కంటే మద్యం బ్రాండ్లపైనే శ్రద్ధా?
- 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్‌పై హరీశ్ రావు ఫైర్
- యువతకు ఉద్యోగాలు వద్దా? మద్యం వ్యాపారమే ముఖ్యమా?
- ఇదేనా ప్రజా పాలన? రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్
- 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?: హరీశ్ రావు 03
- రేవంత్ పగ.. యువత దగ: హరీశ్ రావు



రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు.



# స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి

**ఏలూరు,ఫ్లాష్ ఇండియా :** మన ఉత్పత్తులు ప్రపంచానికి ఆదర్శం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ర్కొన్నారు. ఈరోజు (సోమవారం) ఏలూరు జిల్లాలోని కాట్రేనిపాడులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు పర్యటించారు. ఉపరాష్ట్రపతితో కలిసి సీఎం చంద్రబాబు పాప్‌కార్న్ సీడ్‌ను ఆవిష్కరించారు. దేశంలో తొలి నాన్-GMO పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనం అమల్లోకి రానుంది. ముసునూరులో పాప్‌కార్న్ మెయిజ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. తక్కువ కాలంలో విజయం సాధించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ ప్లాంట్ 29 టన్నుల సామర్థ్యంతో.. ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా నిలుస్తోందని వివరించారు.

**గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలి..**

భవిష్యత్తులో పాప్‌కార్న్ అంటే గుర్తొచ్చేది ముసునూరు అని సీఎం చంద్రబాబు తెలిపారు. 11 ఏళ్లలో మొక్కజొన్న ఉత్పత్తి వాటా 65శాతానికి పెరిగిందని అన్నారు. అన్ని దేశాలకు ఇక్కడి నుంచే పాప్‌కార్న్ పంపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్తే.. వస్తువు విలువ చాలా రెట్లు పెరుగుతుందని వెల్లడించారు. స్వదేశీ విధానంతో స్వయం సమృద్ధి సాధించాలని చెప్పారు. ఈ నెల్లోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. వ్యవసాయానికి ఎల్‌నినో పెద్ద సమస్యగా మారిందని అన్నారు. ఇంకా 52 శాతం వర్షపాతం లోటుగా ఉందని తెలిపారు. గోదావరి, కావేరీ నదులు అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. దేశంలో నదులు అనుసంధానం కావాలని కోరుకునే వ్యక్తి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అని కొనియాడారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని ఉపరాష్ట్రపతి కోరుతున్నారని తెలిపారు. గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానం చేస్తే నాలుగు రాష్ట్రాల సమస్యలు సమసిపోతాయని పేర్కొన్నారు.

**ఇన్నోవేటివ్ విధానంలో ఆలోచించాలి..**

దేశంలో మొదటిసారి నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశీయ విత్తనాన్ని ఆవిష్కరించిన గోర్మెట్ పాప్ కార్నియా కంపెనీకి అభినందనలు తెలిపారు. సాధారణంగా ఆలోచిస్తే, మామూలుగానే జీవిస్తామని వెల్లడించారు. ప్రతి అంశం ఇన్నోవేటివ్ విధానంలో ఆలోచించాలని సూచించారు. దేశ వ్యాప్తంగా పాప్ కార్న్ అంటేనే భవిష్యత్తులో ముసునూరు గుర్తుకు వస్తుందని చెప్పారు. దేశంలో పాప్ కార్న్ ఎగుమతులతో 185 మిలియన్ డాలర్లు ఆదా అయ్యాయని వివరించారు. భవిష్యత్తులో ప్రపంచ దేశాలకు మనం ఉత్పత్తి చేసే పాప్ కార్న్ ఎగుమతి అయ్యేలా చూడాలని అన్నారు. కేంద్రం వ్యవసాయాన్ని జీవనోపాధిగా చూడటం లేదన్నారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించి, పారిశ్రామిక విధానంలో తీసుకెళ్లాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రపంచానికి మనం పదిశాతం ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నామని వెల్లడించారు. దానిని 50 శాతానికి పెంచితే ఉపాధి కలుగుతుందని, ఆదాయం పెరుగుతుందని వివరించారు.

**సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకోవాలి..**

ప్రతీ కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయాలనేదే తమ లక్ష్యమని సీఎం వ్యాఖ్యానించారు. రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో ఒక ప్రాజెక్టును వచ్చే డిసెంబర్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. రాయలసీమను ప్రపంచ హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వస్తే, నూజివీడు నియోజకవర్గ పరిస్థితే మారిపోతుందని చెప్పారు. మూడు దశాబ్దాల క్రితం మొదలుపెట్టిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని ఈ నెలలో విడుదల చేస్తున్నామని వెల్లడించారు. సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకుని, రైతులకు ఏ పంట వేయాలో అవగాహన కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# కుట్రతోనే అడ్డుకున్నారు..

## పార్టీ అంతర్గత విషయాలపై మాట్లాడను

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అభివృద్ధి, విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా తాను తలపెట్టిన విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్‌లో భాగస్వామ్యమవుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటే, కేంద్రం రాజకీయ కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

**విదేశీ పర్యటన ఉద్దేశం.. విద్య, పెట్టుబడులే మా లక్ష్యం**

రాష్ట్రాల కలయికతోనే కేంద్రం ఏర్పడుతుందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ రైజింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో విద్య, క్రీడలు, పారిశ్రామిక రంగానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గాంధీ, అంబేద్కర్ లాంటి మహనీయులు చదువుకున్న ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావాలని భావించామని, ఇక్కడే ఆ స్థాయి క్యాంపస్‌లు వస్తే వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని వివరించారు.

**లండన్‌కు ఓకే.. అమెరికాకు నో ఎందుకు?**

తన విదేశీ పర్యటనకు సంబంధించి కేంద్రానికి సమర్పించిన దరఖాస్తులో అన్ని వివరాలు పక్కాగా పొందుపరిచామని, పర్యటన ఉద్దేశాన్ని (పర్పస్) స్పష్టంగా వివరించామని సీఎం తెలిపారు. దరఖాస్తులో అసంపూర్ణ వివరాలు ఉన్నాయంటూ బీజేపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. లండన్, అమెరికా పర్యటనలకు ఒకే రకమైన ప్రతిపాదనలు సమర్పిస్తే.. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతినిచ్చి, అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యటనలో విషయంలో లేకపోతే ఇంగ్లాండ్‌కు ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

**పర్యటనపై బీజేపీ రాజకీయాలు.. మోడీ గుజరాత్‌కే ప్రధానా?**

కేంద్రం తీసుకున్న ఈ రాజకీయ నిర్ణయం తెలంగాణ ముఖ్యమంత్రిని తిరస్కరించడం కాదని, ఇది తెలంగాణ ప్రజలను తీవ్రంగా అవమానించడమేనని రేవంత్ ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా కాకుండా కేవలం 'గుజరాతీ'గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గుజరాత్ ముఖ్యమంత్రి వైబ్రెంట్ గుజరాత్ రోడ్ షోల కోసం అమెరికా, కెనడాల్లో పర్యటించేందుకు అనుమతి ఇచ్చిన కేంద్రం, తెలంగాణ అభివృద్ధి కోసం తాను వెళ్తానంటే ఎందుకు అడ్డుకుందో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా దేశంలోని అనేకమంది నాయకులు, కోట్లాది మంది ప్రజలు తప్పుబడుతున్నారని పేర్కొన్నారు. పరిపాలనాపరమైన ఈ అంశంపై విచక్షణ కోల్పోయి అవాస్తవాలు ప్రచారం చేస్తున్న రాష్ట్ర బీజేపీ నాయకులకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదని, వారికి ఆ స్థాయి కూడా లేదని తేల్చిచెప్పారు.

**ఇది ఫెడరల్ స్ఫూర్తిపై దెబ్బ.. పార్లమెంట్‌లో పంచాయితీ ఖాయం**

తన విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల స్పష్టమైన వివక్ష చూపిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి గొడ్డలిపెట్టులా వ్యవహరిస్తోందని, ఈ నిర్ణయాన్ని తాము ఆషామాషీగా తీసుకోబోమని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఖచ్చితంగా ఈ అంశాన్ని లేవనెత్తుతామని స్పష్టం చేశారు.

**'మోడీది గుజరాత్.. నాది తెలంగాణ' అన్నదే మీ రాజకీయ అభ్యంతరమా?**

నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ పాలిత తెలంగాణకు మధ్య కేంద్రం కావాలనే రాజకీయ వైరం చూపిస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రధాని మోడీ గుజరాత్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుంటే, తాను తెలంగాణ ప్రతినిధిగా అభివృద్ధిని కాంక్షిస్తున్నానని, ఇదేనా కేంద్రానికి ఉన్న ప్రధాన రాజకీయ అభ్యంతరం అని ప్రశ్నించారు. విదేశీ వేదికలపై దేశం గురించి మాట్లాడితే వెంటనే వారిపై 'దేశద్రోహి' అని ముద్ర వేసి, దేశ అంతర్గత విషయాలను బయట మాట్లాడారంటూ తప్పుడు ప్రచారం చేయడానికి సిద్ధపడతారని మండిపడ్డారు.

**పర్యటనను అడ్డుకోగలరు.. నా ఆలోచనను కాదు**

కేంద్ర ప్రభుత్వం కేవలం తన పర్యటనను మాత్రమే భౌతికంగా అడ్డుకోగలదని, కానీ రాష్ట్ర అభివృద్ధి కోసం ఉన్న తన ఆలోచనలను, ప్రణాళికలను ఆపలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రతినిధి బృందాన్ని, అధికారులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అమెరికాకు పంపించామని, అక్కడ కీలకమైన ఒప్పందాలు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. సాధారణంగా ఏ అధికారిక విదేశీ పర్యటన జరిగినా ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయం ప్రతి సమావేశంలో పాల్గొంటుందని, ప్రొటోకాల్ ప్రకారం అన్ని సమీక్షించి నివేదికను కేంద్రానికి పంపుతుందని వివరించారు. అలాంటప్పుడు ప్రధాని దృష్టిలో లేకుండా లేదా అనుమతులు లేకుండా తాము సొంతంగా పర్యటనలు చేస్తామా అని ప్రశ్నించారు.

**తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న గుజరాత్ నాయకత్వం**

గుజరాత్ కేంద్రంగా పనిచేస్తున్న నాయకత్వం తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందడాన్ని ఓర్చుకోలేకపోతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి ముందంజలో ఉంటే, కావాలనే ఆటంకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇది కేవలం ఒక పార్టీకి లేదా ఒక ముఖ్యమంత్రికి జరిగిన అవమానం కాదని, మొత్తం తెలంగాణ సమాజానికి జరిగిన పరాభవమని పేర్కొంటూ, కేంద్ర వైఖరిని రాష్ట్రంలోని తెలంగాణ వాదులు, ప్రజలందరూ ఏకకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

**కొండా సురేఖ ఎపిసోడ్‌పై రేవంత్ క్లారిటీ.. కీలక వ్యాఖ్యలు..**

లండన్ పర్యటనపై సీఎం రేవంత్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. అనంతరం ఇటీవల మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించింది. అయితే.. కొండా సురేఖ , ఆమె కుమార్తె ఇటీవలి వ్యాఖ్యల వ్యవహారంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈ అంశం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ పరిశీలనలో ఉందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అంతర్గత వ్యవహారాల గురించి బహిరంగంగా మాట్లాడనని స్పష్టం చేశారు. పార్టీలో క్రమశిక్షణ అత్యంత కీలకమని, క్రమశిక్షణా కమిటీ దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. హైకమాండ్ , పార్టీ తీసుకునే ఏ నిర్ణయానికైనా నాయకులంతా క్రమశిక్షణతో కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్ సూచించారు.

# స్టే ఎత్తివేత.. కానీ..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించే 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాల అమలుపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ పథకాల నిధుల విడుదలపై ఇచ్చిన మధ్యంతర స్టేను సవరిస్తూ, దివ్యాంగ వధువులకు సంబంధించి ఊరటనిచ్చే నిర్ణయాన్ని వెల్లడించింది.

**దివ్యాంగులకు స్టే ఎత్తివేత.. మిగతా వారికి కొనసాగింపు**

దివ్యాంగ వధువులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అందించే ఆర్థిక సాయంపై గతంలో విధించిన స్టేను హైకోర్టు తొలగించింది. దీంతో దివ్యాంగ లబ్ధిదారులకు నిధుల విడుదల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. అయితే దివ్యాంగులు మినహా మిగిలిన సాధారణ వర్గాల లబ్ధిదారులకు సంబంధించి మాత్రం నిధుల విడుదలపై ఉన్న స్టే యథాతథంగా కొనసాగుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన చట్టబద్ధత, జీవోల అమలుపై తమ వాదనలు విన్పించేందుకు, పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ సమర్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని సమయం కోరింది. దీనిపై స్పందించిన ఉన్నత న్యాయస్థానం, ప్రభుత్వ విన్నపాన్ని పరిశీలించి కౌంటర్ దాఖలుకు రెండు వారాల గడువు మంజూరు చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.



# బీజేపీ నేతలతో హరీశ్ వ్యాపారం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తాజాగా హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు కుటుంబ సభ్యులకు చెందిన మిల్చి మిల్క్ కంపెనీ విషయంలో పొంగులేటి విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు ఓవైపు బీజేపీ పార్టీ నేతలకు సంబంధించిన సంస్థలతో వ్యాపారాలు చేసిన హరీశ్ రావు... బండారం బయటపడటంతో తన కంపెనీ వెబ్‌సైట్‌ను మూసేశారని ఏ తప్పూ లేకపోతే కంపెనీ వెబ్‌సైట్‌ను ఎందుకు మూసేశారని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆరోపణలు గుప్పించారు.

**మీలాగా ఫాంహౌస్ ప్రభుత్వం కాదు:**

ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం హరీశ్ రావుకు మొదటి నుంచీ అలవాటేనని ప్రభుత్వ భూముల అమ్మకాలు.. పర్సంటేజీలు తీసుకోవడం... బండారం బయటపడిన తర్వాత వెబ్‌సైట్‌ను మూసేయడం... ఇలాంటి అంశాలపై హరీశ్ రావు మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేతలు కూడా సిగ్గుపడుతున్నారన్నారు. సమస్య వచ్చినప్పుడు నిజాయితీగా, జవాబుదారీతనంతో ముందుండి రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజా ప్రభుత్వం అని మీలాగా ఫాంహౌస్ ప్రభుత్వం కాదు హరీశ్ రావు అంటూ కౌంటర్ ఇచ్చారు.

# నివేదిక సిద్ధం

## మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై నివేదిక సిద్ధం చేసిన క్రమశిక్షణ కమిటీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదికను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఈ కమిటీ ఇవ్వనుంది. ఈ క్రమంలోనే కొండా సురేఖపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.కొండా సురేఖతో పాటు మరో ఇద్దరి వ్యవహారంపై కఠిన నిర్ణయం తీసుకునేలా క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు (సోమవారం) సాయంత్రం ఈ నివేదికను ఏఐసీసీకి మహేశ్ గౌడ్ పంపనున్నారు. ఆమె వివరణకు క్రమశిక్షణ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయలేదని సమాచారం.కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె కూతురు సుస్మిత ఆరోపణలు చేస్తే సహజ న్యాయ సూత్రం ప్రకారం సురేఖ ఖండించాల్సి ఉందని.. కానీ అలా చేయలేదని ఈ కమిటీ అభిప్రాయపడింది. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం, పార్టీపై ఎవరు తప్పుడు మాటలు మాట్లాడినా తప్పనిసరిగా చర్యలు ఉండాల్సిందేనని ఈ కమిటీ స్పష్టం చేసింది. గతంలో కొండా సురేఖను కాపాడానని, ఇక తానేమీ చేయలేనని మహేశ్ గౌడ్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

**సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ**

ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై ఇరువురు నేతలు ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. ఇటీవల భట్టితో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి భేటీ అయ్యారు. కొండా సురేఖ అంశంపై సీఎం రేవంత్, భట్టి విక్రమార్క చర్చించనున్నట్లు సమాచారం.

# అసెంబ్లీ రేసులో తీన్మార్ మల్లన్న..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ప్రధాన పార్టీలన్నీ వచ్చే ఎన్నికల కోసం అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. అధికారమే లక్ష్యంగా పార్టీలన్నీ కార్యాచరణను సిద్ధం చేసుకుని వాటిని అమలు చేసేలా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వచ్చే ఎన్నికల్లో పోటీపై సంచలన ప్రకటన చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన ఆలేరు నుండి పోటీ చేయబోతున్నట్లు స్పంష్టం చేశారు. ఇవాళ ఈసీఐఎల్ లో జెన్ జీలతో సమావేశమైన తీన్మార్ మల్లన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన ఓటు హక్కు అక్కడే ఉందని తన తాతలు అక్కడే ఉన్నారన్నారు.

**పాదయాత్రకు రెండు ప్రాంతాలు:**

ప్రజాసమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలపై సెప్టెంబర్ 15 నుంచి పాదయాత్ర మొదలు పెట్టబోతున్నట్లు మల్లన్న ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పాదయాత్రను ప్రారంభించేందుకు హైదరాబాద్, అలంపూర్ ఈ రెండు ప్రాంతాలను అనుకున్నామని వీటిలో ఓదో ఒక చోట నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. వచ్చే నెలలో జరగబోతున్న వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై తాను మాట్లాడబోతున్నట్లు చెప్పారు. దేశంలో ఓ యూనివర్సిటీ కింద ఏ కాలేజీ లేని ఏకైక యూనివర్సిటీ స్కిల్ ఇండియా యూనివర్సిటీ అని ఈ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కే స్కిల్ లేదని విమర్శించారు.

**ఎమ్మెల్సీ గా పోటీలో ఉంటారా లేదా?**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని తీన్మార్ మల్లన్న ప్రకటించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. నిజానికి మల్లన్న నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పదవి కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. ఇందుకు సంబంధించిన ఎన్నికలపై కసరత్తు ఇప్పటికే రాజకీయ పార్టీల్లో మొదలైంది. ఈ నేపథ్యంలో త్వరలో తన సిట్టింగ్ స్థానాన్నికి ఎన్నికలు జరగనుండగా శాసనసభకు పోటీ చేస్తానని ప్రకటించడం చర్చగా మారింది. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్న తీన్మార్ మల్లన్న తన సిట్టింగ్ స్థానానికి మరోసారి ఎమ్మెల్సీగా పోటీ చేస్తారా లేదా అనేది క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# ఆర్థిక వివాదంలో వ్యాపారుల పై దాడి

**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** ఆర్థిక లావాదేవీల వివాదంలో బాధితులను అక్రమంగా నిర్బంధించి, తీవ్రంగా గాయపరిచి వాహనాలు, డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఐదుగురు నిందితులను గోషామహల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ తెలిపిన వివరాల ప్రకారం బేగంబజార్‌లోని 'వినోద్ ఇంపెక్స్' యజమాని కరణ్ కుమార్ వద్ద బాధితులు మహమ్మద్ అక్బర్, మహమ్మద్ అలీమ్ రెండేళ్లుగా డ్రై ఫ్రూట్స్ కొనుగోలు చేస్తున్నారు. ఫోర్జరీ ద్వారా రూ.8 లక్షల మేర అక్రమాలకు పాల్పడ్డారనే నెపంతో ఈ నెల 20న బాధితులను గోదాన్‌లో నిర్బంధించారు. స్టీల్ పైపులతో దాడి చేసి, విడిచిపెట్టాలంటే రూ.2 లక్షల నగదుతో పాటు కారు, ఆటో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులను కాపాడేందుకు వచ్చిన వారి తల్లిదండ్రులను సైతం నిర్బంధించారు. అయితే బాధితులు మరుసటి రోజు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొంది గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి కరణ్ కుమార్




(జోషివాడి), హనుమాన్ రామ్ (జోషివాడి), దేవి లాల్ (లేబర్ అడ్డా), శంభు కుమార్ (ఎంజే బ్రిడ్జ్), జుమార్ అలియాస్ జుమార్ గుర్జర్ (లేబర్ అడ్డా)లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద రెండు మొబైల్ ఫోన్లతో పాటు రెండు కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరోవైపు శుభమ్ పరిహార్, తరుణ్, మనీష్, ప్రవీణ్, పంకజ్, దత్తా పరారీలో ఉన్నట్లు, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బెదిరింపులు లేదా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు దశలవారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమలకు ప్రభుత్వం ప్రజల బ్రెయిన్ వాష్ చేసే కార్యక్రమం చేస్తోందని ఇందులో భాగంగానే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల మాటలు, ఇటీవల నెక్లెస్ రోడ్డులో స్మార్ట్ మీటర్ల ఉపయోగం పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను రిలీజ్ చేసిన కవిత.. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షాన కాకుండా పెద్దల పక్షాన ఉందని పదే పదే నిరూపించుకుంటోందని దుయ్యబట్టారు.

**సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర:**

కార్పొరేట్లతో కుమ్మకై విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీ ఎత్తేయాలనే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ముందు మోకరిల్లి వాళ్లు తీసుకొస్తున్న తలా తోక లేని విధానాలను సమర్థిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మీటర్లన్నీ స్మార్ట్ మీటర్లేనని, ప్రస్తుతం రీడింగ్ కోసం పెన్ను పేపర్‌తో ఏమీ రాసుకోవడం లేదు కదా అని ప్రశ్నించారు. రైతు నల్ల చట్టాల ద్వారా రైతులకు ఏ స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూసిందో అదే అదానీ కంపనీకి చెందిన స్మార్ట్ మీటర్లను మరో కొత్త పథకం పేరుతో కేంద్రం తీసుకురావాలని చూస్తే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. అదానీలకు కొమ్ము కాస్తూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే యూపీలో ఇలాంటి స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

# లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్

## జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా 121 మద్యం బ్రాండ్లకు అనుమతా?: హరీశ్ రావు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. 121 రకాల మద్యం బ్రాండ్స్ కు నోటిఫికేషన్ ఇవ్వడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు, మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**మద్యంపైనే శ్రద్ధా?:**

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువత డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మద్యం షాపులు పెంచి, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. టైమ్‌కు యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు.. మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నదన్నారు.

**ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన?**

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో మోసం చేశారని, ఇక రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయిందని ఎద్దేవా చేశారు. రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా తయారైందన్నారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన? అని ప్రశ్నించారు.

# సీఎం రేవంత్‌పై బీజేపీ చీఫ్ ఫైర్

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ పోరుబాట.. సీఎం రేవంత్‌పై బీజేపీ చీఫ్ ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. "మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి" అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని.. దీనికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని.. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ తెలిపారు. "యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై లాఠీచార్జ్ చేయించి, పోలీసులతో దురుసుగా వ్యవహరింపజేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి నిరసనలో నేను స్వయంగా పాల్గొన్నాను. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు? స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదు? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మా పోరాటం ఆగదు. ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి!" అంటూ వ్యాఖ్యానించారు.

# భూసేకరణ వేగవంతం..

## రూ.250 కోట్ల నిధులు మంజూరు:మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగురుమామిడి మండలం కొండాపూర్‌లో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. మూడు జిల్లాల కలెక్టర్లు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని చెప్పారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, రైతులు ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా ఒడిసి పట్టేందుకు ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. కొండాపూర్‌లో గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. గుడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**250 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి..**

అంతకుముందు హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ నాణ్యత, ప్రమాణాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు మరింత చేరువ కానున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ మర్క రాజ్‌కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



# నీ పద్ధతి మార్చుకో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫీజు బకాయిల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిగిరావాలని లేదంటే ఇది రాష్ట్రమంతటా అంటుకుని మీ ముఖ్యమంత్రి సీటుకే ఎసరు తెస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇవాళ ఇందిరా పార్క్ వద్ద ఫీజు రీయింబర్స్ మెంట్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేపట్టిన ఫీజుల బకాయి-బీజేపీ లడాయి దీక్షకు మద్దతు తెలిపిన కృష్ణయ్య ఈ సందర్భంగా మాట్లాడారు. ఫీజు రీయింబర్స్ మెంట్ స్కీమ్ ను తొలగించాలనే కుట్ర సీఎం కడుపులో ఉందని గతంలో రోశయ్య హయంలోనూ ఇలాగే కుట్ర చేస్తే తామంతా దీక్షకు దిగడంతో పాత బకాయిలు చెల్లించడంతో పాటు పథకం కొనసాగించక తప్పలేదన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం వల్లే అనేక మంది బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారన్నారు.

**రేవంత్ రెడ్డి ఇక నీ అధికారానికి సవాల్:**

రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. తమ బకాయిల విడుదల చేయాలని కాలేజీల యాజమాన్యాలు ఆందోళన బాట పడితే వారిని బ్లాక్ మెయిల్ చేసి బ్లాక్ లిస్టులో బెట్టి బెదిరిస్తున్నారని ఇక నాలాంటి వారు ప్రశ్నిస్తే నన్ను ఆంధ్రప్రదేశ్ ఎంపీ అంటూ సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమస్యను డైవర్ట్ చేయడానికే చూస్తున్నారు తప్పా పరిష్కరించడం లేదని విమర్శించారు. ఈ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని ఇందులో ఎలాంటి సందేహాలం లేదన్నారు. ఈ ఫీజు రీయింబర్స్ మెంట్ ఉద్యమం తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం కంటే పెద్దగా జరగబోతోందని ఈ ఉద్యమం రేవంత్ రెడ్డి అధికారానికి సవాల్‌గా మారబోతోందని హెచ్చరించారు. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించడానికి ఉన్న నిధులు విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవా? అని నిలదీశారు. నెలకు ఇన్ని కోట్ల అప్పులు చేస్తూ ఆ డబ్బులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. చదువే అన్నింటికి మూలం అని రేవంత్ రెడ్డి గొప్ప సంఘ సంస్కర్తలా మాట్లాడితే ఫీజు బకాయిలు చెల్లిస్తాడని అనుకున్నాం. కానీ ఆ మాటలు ఉపన్యాసాలకే పరిమితమయ్యాయన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకుని విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ హైదరాబాద్ పరిధిలో 22ఏ (నిషేధిత భూముల జాబితా) అంశంపై నెలకొన్న గందరగోళం, ప్రతిపక్షాల ఆరోపణలు, రెవెన్యూ శాఖ చేపడుతున్న చర్యలపై ఆయన సుదీర్ఘంగా వివరించారు.

**22ఏ భూములపై స్పష్టత.. ప్రతిపక్షాల దుష్ప్రచారంపై ఆగ్రహం**

కోర్ హైదరాబాద్ పరిధిలోని 22ఏ భూముల అంశం చాలా జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు కొన్ని నిజాలు, అబద్ధాలు కలిపి ప్రచారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. గడిచిన నాలుగు వారాలుగా 22ఏ భూముల అంశంపై రెవెన్యూ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని, 22ఏ జాబితా వల్ల నష్టపోయిన నిజమైన బాధితులకు ప్రభుత్వం ఖచ్చితంగా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. పారదర్శకత కోసం ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న అన్ని రకాల ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని వెల్లడించారు. స్లాట్ బుక్ చేసుకుంటున్న వారిలో దాదాపు 98 శాతం మంది రిజిస్ట్రేషన్లను ఇప్పటికే క్లియర్ చేశామని, 300 పైచిలుకు స్లాట్లలో 10 నుంచి 12 మినహా మిగతావన్నీ పూర్తి చేశామని తెలిపారు. అయితే దేవాదాయ, భూదాన్ భూములను రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని స్పష్టం చేశారు.

**టోల్ ఫ్రీ నంబర్‌కు విశేష స్పందన.. దొంగ జీవోలపై సీరియస్**

టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను మంత్రి గణాంకాలతో తిప్పికొట్టారు. ఆగస్టు 17న మొదటి రోజు 2 కాల్స్ రాగా, ఆ తర్వాతి రోజుల్లో వరుసగా 116, 168, 200, 369, 309 కాల్స్ చొప్పున మొత్తం 1,162 కాల్స్ వచ్చాయని తెలిపారు. ఇందులో అగ్రికల్చర్ భూములకు సంబంధించి 614, నాన్-అగ్రికల్చర్ విభాగానికి సంబంధించి 547 కాల్స్ వచ్చాయని, జెన్యూన్ గా ఉన్న 980 కాల్స్‌ను 24 నుంచి 48 గంటల్లో ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పరిష్కరించామని చెప్పారు. ఇదే సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు కొందరు దొంగ జీవోలు, మెమోలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వాన్ని కంగారు పెట్టి తమ స్వార్థ పనులు పూర్తి చేసుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**సీఎస్ 7, సీఎస్ 14 భూములపై 'సిట్' విచారణకు సిద్ధం**

మేడ్చల్ జిల్లాలోని సీఎస్ 7, సీఎస్ 14 భూములకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని, సుప్రీంకోర్టు ఇచ్చే తుది ఆదేశాల ప్రకారమే రిజిస్ట్రేషన్ల నిర్ణయం ఉంటుందని తెలిపారు. 2017లో నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈ భూములపై పోరాటం చేశారని, అప్పట్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. గత ప్రభుత్వం తమ స్వలాభం కోసం సామాన్యులను అడ్డుపెట్టుకుని పనులు పూర్తి చేసుకుందని విమర్శించారు. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వానికి చెందిన ఒక పత్రిక ఎండీకి బెంజ్ కారు ఇచ్చారనే వార్తలు చినికి చినికి గాలివానగా మారాయని గుర్తుచేస్తూ, నాటి సీఎస్ 7, సీఎస్ 14 భూముల కుంభకోణంపై 'సిట్' విచారణకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.


**యుఎల్సి, భూదాన్ భూములపై త్వరలో కొత్త పాలసీ**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న యుఎల్సి, భూదాన్ భూములకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందిస్తోంది. నాదర్‌గుల్ (సర్వే నంబర్లు 773, 775, 776, 786), మేడ్చల్ జిల్లా కేంద్రం (సర్వే నంబర్లు 68/1, 70/1, 71)లోని యుఎల్సి భూములకు సంబంధించి కొన్నింటిని క్లియర్ చేశామని, మిగిలిన వాటి క్లియరెన్స్ కోసం త్వరలోనే ఒక స్పష్టమైన పాలసీని తీసుకువస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రికి, తనకు సంబంధించిన ఇళ్లు కూడా ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్నాయని మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 403లోని 1288 ఎకరాల్లో కేవలం రెండు ప్లాట్ల సమస్య ఉంటే, మొత్తం సర్వే నంబర్‌నే నిషేధిత జాబితాలో పెట్టేశారని ఉదాహరించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో సర్వే నంబర్ 173 పట్టా భూమిలో కాకుండా 172 ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మేడ్చల్ జిల్లా పర్వతపూర్‌లో వేల ఎకరాల విస్తీర్ణం ఉన్న గ్రామానికి, దాని హామ్లెట్ గ్రామానికి గత ప్రభుత్వం ఒకే సర్వే నంబర్ ఇవ్వడం వల్ల సమస్య తీవ్రమైందని, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. మహేశ్వరం మండలంలోని 22 సర్వే నంబర్‌లో ఉన్న 22 ఎకరాల భూదాన్ భూముల సమస్యతో పాటు ఇతర భూదాన్ భూముల వ్యవహారాలను 'కేస్ బై కేస్' పద్ధతిలో లోతుగా పరిశీలిస్తున్నామని తెలిపారు.

**మెదక్ ఆక్రమణలు, 'అబద్ధాలరావు' పాత్రపై ఆగ్రహం**

మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ వంటి పక్క రాష్ట్రాలు భూముల సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టగా, తెలంగాణలో మాత్రం మొదటి నుంచి భూముల సమస్యలు పేరుకుపోయాయని మంత్రి అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల ప్రారంభంలో ఏడు నెలల పాటు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పరిధిలోని సికిందరపూర్ తదితర గ్రామాల్లో 522 ఎకరాల అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో పెట్టారని, ఎన్నికల ముందు 8 నుంచి 12 ఎకరాల చొప్పున ఓఆర్‌సిలు ఇష్టానుసారంగా కట్టబెట్టారని ఆరోపించారు. 1958కి ముందు ఇచ్చినట్లుగా అబద్ధాలు సృష్టించి కలెక్టర్ సహాయంతో 'అబద్ధాలరావు' అనే వ్యక్తి తన మనుషులకు ఈ భూములను రాసిచ్చారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2023 డిసెంబర్ 7 నాటికి ఎంత విస్తీర్ణం నిషేధిత జాబితాలో ఉందో, నిన్నటి వరకు ఎన్ని ఎకరాలు చేర్చారో వివరాలన్నీ పారదర్శకంగా ప్రజల ముందు ఉంచుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పేరుతో గ్రామాల్లోకి వెళ్లలేకపోయిన నాయకులు, ఇప్పుడు ప్రజలను అడ్డుపెట్టుకుని ఆదే దొంగ ఆటలను సాగనివ్వమని తేల్చిచెప్పారు.

# కృష్ణానదిపై వంతెన నిర్మించండి సార్...



**అడవిదేవులపల్లి,ఫ్లాష్ ఇండియా :**

అడవిదేవులపల్లి మండల శివారులోని కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అనుసంధానిస్తూ వంతెన నిర్మించాలని అడవిదేవులపల్లి గ్రామస్థులు ప్రజావాణిలో ఎంపీడీవో హందనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల రాకపోకల కోసం నదిపై వారధి నిర్మిస్తే, ప్రయాణ దూరం తగ్గుతుందని తెలిపారు. అలాగే మిర్చి రైతులకు గుంటూరు మార్కెట్ చేరువ అవుతుందని, పరిశ్రమలకు సరుకు రవాణా సౌలభ్యం,పర్యాటక రంగం, వాణిజ్యం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

# దోరేపల్లి శివారులో చిరుతపులి సంచారం

**మద్దూరు,ఫ్లాష్ ఇండియా :** మద్దూరు మండలం దోరేపల్లి శివారు పల్లెగడ్డ బందెప్ప పొలం వద్ద ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో చిరుతపులి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని సోమవారం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కోస్గి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్ అక్కడ చిరుతపులి పాదముద్రలను పరిశీలించి, ఆ ప్రాంతంలో చిరుత సంచరించినట్లు ధ్రువీకరించారు. చిరుత సాధారణంగా మనుషులపై కారణం లేకుండా దాడి చేయదని, దాని పై ఎవరైనా దాడి చేసినప్పుడు లేదా ప్రాణహాని ఏర్పడినప్పుడు మాత్రమే ఆత్మరక్షణ కోసం దాడి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో దోరేపల్లి శివారు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## సంపాదకీయం

# సమాజానికి తీవ్రమైన హెచ్చరిక




నిజామాబాద్ జిల్లాలో గంజాయి వినియోగం పట్టణ ప్రాంతాలను దాటి గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తోందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు కొద్దిమంది పెద్దలకు మాత్రమే పరిమితమైన అలవాటు.. ఇప్పుడు యువత, కాలేజీ విద్యార్థులు, చివరకు పాఠశాల స్థాయి విద్యార్థుల వరకు చేరుతోందన్న ఆరోపణలు పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో సూచిస్తున్నాయి. గంజాయి సమస్యను కేవలం పోలీసుల సమస్యగా చూడటం ఇక సాధ్యం కాదు. ఇది కుటుంబ వ్యవస్థ, విద్యా వ్యవస్థ, యువత భవిష్యత్తు, సామాజిక భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశం.

**మారుతున్న గంజాయి సంస్కృతి**

గతంలో కాయకష్టం చేసే కొందరు అలసట, ఒంటి నొప్పుల నుంచి ఉపశమనం కోసం గంజాయిని ఉపయోగించేవారన్న వాదనలు ఉండేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు అక్రమ రవాణాలోకి ప్రవేశించడం, యువతలో ఆసక్తి పెరగడం, చిన్న వయసులోనే వ్యసనానికి గురవడం వంటి పరిణామాలు సమస్యను మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి.ముఖ్యంగా విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారన్న ఆరోపణలు నిజమైతే.. అది అత్యంత తీవ్రమైన హెచ్చరిక. పాఠశాల వయసులోనే మాదకద్రవ్యాల పరిచయం ఏర్పడితే చదువు, ప్రవర్తన, కుటుంబ సంబంధాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై దీర్ఘకాలిక ప్రభావం పడే ప్రమాదం ఉంది.

**సరఫరా వ్యవస్థను ఛేదించాలి**

గంజాయి వినియోగాన్ని తగ్గించాలంటే ముందుగా సరఫరా వ్యవస్థపై దృష్టి పెట్టాలి. మహారాష్ట్ర, ఒడిశా వంటి ప్రాంతాల నుంచి రైల్వే మార్గం ద్వారా గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారం నేపథ్యంలో రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు, ఎక్సైజ్, నార్కోటిక్స్ విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.చిన్న మొత్తంలో గంజాయితో పట్టుబడే వినియోగదారులపై చర్యలు తీసుకోవడం మాత్రమే సరిపోదు. అసలు సరఫరాదారులు ఎవరు? మధ్యవర్తులు ఎవరు? ఎక్కడ నిల్వ చేస్తున్నారు? ఎవరికి పంపిస్తున్నారు? ఈ నెట్‌వర్క్ వెనుక ఆర్థిక లావాదేవీలు ఎలా జరుగుతున్నాయి? అనే అంశాలపై లోతైన దర్యాప్తు జరగాలి.ఒక వ్యక్తిని అరెస్ట్ చేయడం కంటే.. అతని వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను గుర్తించి దెబ్బతీయడం ద్వారానే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలం.

**రాజకీయ అండ ఉందన్న ఆరోపణలపై విచారణ అవసరం**

గంజాయి దందాకు రాజకీయ నాయకులు, అధికారులు లేదా ప్రభావవంతమైన వ్యక్తుల అండ ఉందన్న ఆరోపణలు వినిపిస్తే అవి అత్యంత సీరియస్‌గా తీసుకోవాలి. అయితే ఆధారాలు లేకుండా ఎవరినీ దోషులుగా ప్రకటించడం కూడా బాధ్యతాయుతమైన జర్నలిజం కాదు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిపై స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరగాలి.మాదకద్రవ్యాల విషయంలో రాజకీయ జోక్యం లేదా ఒత్తిళ్లు ఉన్నాయన్న అనుమానం ప్రజల్లో ఏర్పడితే.. అది చట్ట అమలు సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అందుకే నిందితుడు ఎంత ప్రభావవంతమైన వ్యక్తి అయినా చట్టం ముందు సమానమే అన్న నమ్మకాన్ని వ్యవస్థ కల్పించాలి.

**పాఠశాలల వద్దే అసలు పోరాటం**

ఈ సమస్యలో అత్యంత ఆందోళన కలిగించే అంశం పాఠశాల విద్యార్థుల వరకు గంజాయి చేరుతోందన్న ఆరోపణలు. విద్యార్థులు గంజాయికి అలవాటు పడటం వారి వ్యక్తిగత సమస్యగా చూడకూడదు. ఒక విద్యార్థి వ్యసనానికి గురైతే అతని స్నేహితులపై, కుటుంబంపై, పాఠశాల వాతావరణంపై కూడా ప్రభావం పడుతుంది.అందుకే పాఠశాలల్లో కేవలం గంజాయి వ్యతిరేక ప్రసంగాలు నిర్వహించడం కాకుండా కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు గుర్తించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. సమస్య బయటపడితే పిల్లలను అవమానించడం, కొట్టడం లేదా సమాజం ముందు ముద్ర వేయడం కాకుండా నిపుణుల సహాయం తీసుకోవాలి.

**వ్యసనానికి గురైన వారికి పునరావాసం అవసరం**

గంజాయి అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పనిసరి. కానీ ఇప్పటికే వ్యసనానికి గురైన యువతను కేవలం నేరస్తులుగా చూడటం సరైన పరిష్కారం కాదు. వారికి మానసిక కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, అవసరమైన చోట డీ-అడిక్షన్ సేవలు అందించాలి.వ్యసనం నుంచి బయటపడిన యువత మళ్లీ అదే వాతావరణంలోకి వెళ్లకుండా పాఠశాలలు, కళాశాలలు, కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలి. యువతకు క్రీడలు, కళలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను పెంచాలి.

**తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తం కావాలి**

పిల్లల్లో అకస్మాత్తుగా ప్రవర్తన మారడం, చదువుపై ఆసక్తి తగ్గడం, అనుమానాస్పద స్నేహాలు, డబ్బు కోసం ఒత్తిడి చేయడం వంటి సంకేతాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదు. పిల్లలతో మాట్లాడటానికి భయపడే కుటుంబ వాతావరణం సమస్యను మరింత పెంచుతుంది.అదే సమయంలో సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయం లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. అయితే నిర్ధారణ లేని ఆరోపణలతో వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం మాత్రం నివారించాలి.

**నిజామాబాద్‌కు ఇది ఒక పరీక్ష**

నిజామాబాద్‌లో గంజాయి విస్తరణపై వస్తున్న ఆరోపణలు నిజమైతే.. ఇది కేవలం పోలీసింగ్ వైఫల్యం కాదు. ఇది మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య. గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకోవడం కంటే అది ఒక విద్యార్థి చేతికి ఎలా చేరిందో తెలుసుకోవడం ముఖ్యం. ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేయడం కంటే అతని వెనుక ఉన్న సరఫరా వ్యవస్థను ఛేదించడం ముఖ్యం. ఒక విద్యార్థిని మందలించడం కంటే అతను వ్యసనంలోకి ఎందుకు వెళ్లాడో అర్థం చేసుకోవడం మరింత ముఖ్యం.గంజాయి దందాపై కఠిన చర్యలు.. యువతపై మానవీయ దృష్టి.. పాఠశాలల్లో నిరంతర అవగాహన.. సరఫరా నెట్‌వర్క్‌పై నిఘా.. రాజకీయ జోక్యాలపై పారదర్శక విచారణ ఈ ఐదు అంశాలు కలిసినప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.నేటి విద్యార్థులను గంజాయి నుంచి కాపాడటం అంటే కేవలం ఒక తరాన్ని రక్షించడం కాదు.. రేపటి సమాజాన్ని రక్షించడం. నిజామాబాద్‌లో ఇప్పుడు అవసరమైనది భయపెట్టే ప్రచారం కాదు.. సమన్వయంతో కూడిన కార్యాచరణ. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి, పాఠశాలలు అప్రమత్తంగా ఉండాలి, తల్లిదండ్రులు పిల్లలకు అండగా నిలవాలి, సమాజం బాధ్యత తీసుకోవాలి. అప్పుడే గంజాయి ఘాటును తగ్గించి.. యువత భవిష్యత్తును కాపాడగలం.

## భవిష్యత్ తరాల కోసం విద్యా విధానాల్లో

# సమూల మార్పులు అవసరం

### పరీక్షల కోసం కాదు.. భవిష్యత్తు కోసం విద్య




దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో నిర్ణయించేది నేటి విద్యా విధానం. తరగతి గదిలో ఈ రోజు నేర్చుకుంటున్న పిల్లలే రేపటి శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు. అందుకే విద్యను కేవలం పరీక్షలు, మార్కులు, ర్యాంకులు, సర్టిఫికెట్లకు పరిమితం చేయడం ఇకపై సాధ్యం కాదు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా భారత విద్యా విధానంలో మరింత లోతైన మార్పులు అవసరం.భారతదేశంలో విద్యా వ్యవస్థ విస్తరించినప్పటికీ, నాణ్యమైన విద్య అందరికీ సమానంగా అందుతోందా? అన్న ప్రశ్నకు ఇప్పటికీ పూర్తి సమాధానం లేదు. ఒకవైపు కార్పొరేట్ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, అంతర్జాతీయ స్థాయి బోధన అందుతుంటే.. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత, సాంకేతిక వనరుల లోపం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ అసమానత భవిష్యత్ తరాల మధ్య కూడా సామాజిక, ఆర్థిక అంతరాలను పెంచే ప్రమాదం ఉంది.మార్కుల కోసం చదువు.. జీవితానికి కాదుప్రస్తుతం మన విద్యా వ్యవస్థలో అతిపెద్ద సమస్యల్లో ఒకటి మార్కుల ఆధారిత విద్య. విద్యార్థి ఎంత బాగా ఆలోచిస్తున్నాడు? సమస్యను ఎలా పరిష్కరిస్తున్నాడు? కొత్త ఆలోచన చేయగలుగుతున్నాడా? సమాజాన్ని అర్థం చేసుకుంటున్నాడా? అనే ప్రశ్నల కంటే పరీక్షలో ఎన్ని మార్కులు వచ్చాయన్నదే ప్రధాన ప్రమాణంగా మారింది.పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం తప్పు కాదు. కానీ మార్కులే విద్యకు అంతిమ లక్ష్యంగా మారడం మాత్రం ప్రమాదకరం. భవిష్యత్ ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానం సరిపోదు. క్రిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్, డిజిటల్ నైపుణ్యాలు పిల్లలకు అవసరం.అందువల్ల పరీక్షా విధానంలో కూడా మార్పులు రావాలి. విద్యార్థి ఒకే పరీక్షలో రాసిన సమాధానాల ఆధారంగా అతని సామర్థ్యాన్ని నిర్ణయించే విధానం నుంచి.. ఏడాది పొడవునా అతని నేర్చుకునే ప్రక్రియను అంచనా వేసే విధానానికి మారాలి.AI యుగానికి పిల్లలను సిద్ధం చేయాలిప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఆటోమేషన్, డేటా సైన్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగ రంగాన్ని ఇప్పటికే మార్చుతున్నాయి. ఈ మార్పుల మధ్య నేటి పిల్లలు రేపటి ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగుపెట్టబోతున్నారు.అయితే మన విద్యా విధానం ఇప్పటికీ అనేక చోట్ల పాత పద్ధతుల చుట్టూనే తిరుగుతోంది. భవిష్యత్ తరాలకు AI literacy, coding, digital safety, cyber awareness, financial literacy, media literacy వంటి అంశాలను వయసుకు తగిన స్థాయిలో బోధించాలి.అయితే ప్రతి పిల్లవాడినీ కేవలం కోడర్‌గా మార్చడం కూడా లక్ష్యం కాకూడదు. సాంకేతికతను ఉపయోగించడంతో పాటు దాని ప్రభావాలను అర్థం చేసుకునే మానవీయ విలువలు, నైతికత, సామాజిక బాధ్యత కూడా విద్యలో భాగం కావాలి.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలిదేశంలోని కోట్లాది మంది పిల్లల భవిష్యత్తు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉంది. అందుకే ప్రభుత్వ పాఠశాలలను కేవలం పేదల పిల్లల పాఠశాలలుగా కాకుండా నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.ప్రతి పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ సదుపాయాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు ఉండాలి. మౌలిక వసతులతో పాటు ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ అందించాలి.ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించి, పిల్లలతో ఎక్కువ సమయం గడిపే అవకాశం కల్పించాలి. ఎందుకంటే ఏ విద్యా విధానం విజయవంతం కావాలన్నా దాని కేంద్రంలో ఉపాధ్యాయుడే ఉంటాడు.విద్యతో పాటు జీవన నైపుణ్యాలుపిల్లలకు గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ ఎంత ముఖ్యమో.. జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యం.పాఠశాల స్థాయి నుంచే ఆర్థిక నిర్వహణ, పొదుపు, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రాథమిక చట్టపరమైన అవగాహన, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను బోధించాలి.అలాగే పిల్లల్లో మానసిక ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో పోటీని మాత్రమే పెంచే విద్యా విధానం కాకుండా వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే వాతావరణం అవసరం. ప్రతి విద్యార్థి ఒకే రకంగా ఉండడు. ఒకరికి చదువులో ప్రతిభ ఉంటే.. మరొకరికి క్రీడల్లో, కళల్లో, సంగీతంలో, సాంకేతికతలో లేదా ఇతర రంగాల్లో ప్రతిభ ఉండవచ్చు. విద్యా వ్యవస్థ ఈ వైవిధ్యాన్ని గుర్తించాలి.ఉన్నత విద్యలో ఉద్యోగం మాత్రమే లక్ష్యం కాకూడదుఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన తర్వాత కూడా అనేక మంది విద్యార్థులు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాల కోసం మళ్లీ శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది. ఇది విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని సూచిస్తోంది.విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో అనుసంధానం పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ప్రాక్టికల్ ట్రైనింగ్, స్టార్టప్ అవకాశాలు, పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థి డిగ్రీ తీసుకునే సమయానికి "నేను ఏం నేర్చుకున్నాను?" అన్న ప్రశ్నకు మాత్రమే కాకుండా "నేను నేర్చుకున్నదాన్ని ఎక్కడ ఉపయోగించగలను?" అన్న ప్రశ్నకు కూడా సమాధానం చెప్పగలగాలి.విద్యను రాజకీయ ప్రయోగశాలగా మార్చకూడదువిద్యా విధానాల్లో మార్పులు అవసరమే. కానీ ప్రతి ప్రభుత్వం మారినప్పుడూ కొత్త విధానాలు, కొత్త పేర్లు, కొత్త పుస్తకాలు, కొత్త ప్రయోగాలు చేయడం వల్ల విద్యార్థులపై భారాన్ని మోపకూడదు.విద్య అనేది రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే రంగం కాకూడదు. కనీసం 15--20 సంవత్సరాల దీర్ఘకాలిక జాతీయ విద్యా దృష్టి ఉండాలి. ప్రభుత్వాలు మారినా విద్యా లక్ష్యాలు మారకూడదు. కేంద్రం, రాష్ట్రాలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పరిశ్రమలు కలిసి భవిష్యత్ విద్యకు ఒక స్థిరమైన మార్గపటాన్ని రూపొందించాలి.పిల్లల భవిష్యత్తే దేశ భవిష్యత్తుభారత్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా ఉంది. ఇది దేశానికి గొప్ప అవకాశమే. కానీ యువ జనాభా మాత్రమే దేశ అభివృద్ధికి సరిపోదు. నైపుణ్యం కలిగిన, ఆలోచించే, ప్రశ్నించే, సృజనాత్మకంగా పనిచేసే, బాధ్యతాయుతమైన పౌరులు కావాలి.అందుకే విద్యా విధానాల లక్ష్యం కేవలం ఉద్యోగాల కోసం విద్యార్థులను తయారు చేయడం కాకూడదు. జీవితాన్ని ఎదుర్కొనే శక్తి ఉన్న మనుషులను తయారు చేయడం కావాలి.పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడం కాదు.. భవిష్యత్తుకు సిద్ధం చేయాలి. పుస్తకాల్లో ఉన్న జ్ఞానాన్ని బోధించడం మాత్రమే కాదు.. ఆ జ్ఞానాన్ని జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్పాలి. మార్కుల కోసం పోటీ పడే విద్యార్థులుగా కాకుండా.. సమస్యలకు పరిష్కారాలు చూపే పౌరులుగా తీర్చిదిద్దాలి.భారత విద్యా విధానంలో మార్పు అనేది ఇక ఐచ్ఛికం కాదు.. అనివార్యం. నేటి పిల్లల కోసం తీసుకునే విద్యా నిర్ణయాలే రేపటి భారతదేశానికి పునాది. ఆ పునాది బలంగా ఉంటేనే భవిష్యత్ భారత్ బలంగా నిలుస్తుంది.

# ఎవరిది పైచేయి?




వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లో విభేదాల చిచ్చు తారాస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్థానిక శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డిల మధ్య ఆధిపత్య సమరం చినికి చినికి గాలి వానలా మారింది. అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి రగిలిన పాత-కొత్త నేతల అంతర్గత పోరు ఒక్కసారిగా బహిర్గతమై అధిష్టానం గడప తొక్కింది. ఇటీవల గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగిన సభలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనానికి తెరలేపాయి ప్రతిపక్ష పార్టీల నుంచి వచ్చే విమర్శల కన్నా సొంత పార్టీకి చెందిన చిన్నారెడ్డి విమర్శలు చేయడాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరుసటి రోజే ఆధారాలతో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లురవికి , రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర ముఖ్య నేతలకు ఫిర్యాదులు చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు డాక్టర్ చిన్నారెడ్డి వర్గీయులు గాంధీభవన్‌కు చేరుకొని పార్టీ కోసం గత 40 సంవత్సరాల నుంచి పని చేస్తూ వచ్చిన తమకు కాకుండా కొత్తగా వచ్చిన వాళ్ళకి పదవులను ఎమ్మెల్యే కట్టబెడుతున్నారని ఫిర్యాదులు చేసి చిన్నారెడ్డికి మద్దతు పలికారు.

**కాంగ్రెస్ నాకు దేవాలయం..**

క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసుపై చిన్నారెడ్డి స్పందిస్తూ.. కాంగ్రెస్ తనకు దేవాలయం లాంటిదని, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పడమే తప్ప అధిష్టానాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే పార్టీ కోసం సంవత్సరాల తరబడి పనిచేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడాన్ని విమర్శించాను అని తన లేఖలో పేర్కొన్నారు. ఈ వివరణను ఎమ్మెల్యే మేఘా రెడ్డి కొట్టిపారేస్తూ 90 శాతం పాత కార్యకర్తలకే తాను న్యాయం చేశానని, అసలు కాంగ్రెస్ ముసుగులో ఇతర పార్టీల వారితో ఎవరు కుమ్మక్కవుతున్నారో బయటపెట్టాలని ప్రతి సవాల్ విసిరారు. చిన్నారెడ్డి వెంబడి ఏ పార్టీ వాళ్లు తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఓసీలు.. ఇతర పనులు ఏ పార్టీ వారికి చేశారో తేల్చాలి అని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. గాంధీభవన్ కు వచ్చిన వారిలో ఏ పార్టీ వారు ఉన్నారు గుర్తించాలన్నారు. వనపర్తి కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయో అని ఆ పార్టీ శ్రేణులే కాకుండా ఉమ్మడి రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# ఆ మిల్లులకు నోటీసులు జారీ?



**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టిన డిఫాల్ట్ మిల్లర్లలో జంకూ లేదు. బకాయిల చెల్లింపు లేదు. ఆయా మిల్లులకు కేటాయించిన ధాన్యం లేదు. పలు డిఫాల్ట్ మిల్లులకు కేటాయించిన కోట్ల రూపాయల ధాన్యం పక్కదారి పట్టించి కోట్ల రూపాయలు వెనకేసుకున్నారు. ఆ డబ్బులు రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడి పెట్టి వాయిదాలకు ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్ స్థాయిలో ఒత్తిళ్లు పెంచుతూ డబ్బుల వసూలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. డిఫాల్ట్ మిల్లర్ల పై కేసులు నమోదు చేస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. మిల్లులకు సంబంధించి ధాన్యానికి కస్టం మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వడం లేదు.కోట్ల రూపాయల డబ్బులను రికవరీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 600లకు పైగా రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులు వరంగల్, మహబూబాబాద్, ములుగు, హన్మకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ మిల్లులకు ప్రతీ సీజన్ లో ధాన్యాన్ని కేటాయింపులు చేస్తారు. ఆ ధాన్యానికి అనుగుణంగా మిల్లర్లు నిర్ణయించిన సమయానికి కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని అందించాలి. ఉమ్మడి జిల్లా పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ మిల్లులకు ధాన్యం కేటాయించారు. వీటిలో వందకు పైగా మిల్లుల యజమానులు కష్టం మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వలేదు.కనీసం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కేటాయించిన ధాన్యం విలువను బట్టి డబ్బులు చెల్లించలేదు.నాలుగేళ్లుగా వాయిదా వేస్తున్నారు. ఈ సీజన్‌లో ఈ మిల్లర్లు సుమారు 140 కోట్లకు పైగా బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి మళ్లించారు. ఆ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని అమ్మకాలు బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. ఈ విషయం విజిలెన్స్ అండ్ ఎంపోర్స్మెంట్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఇచ్చిన ధాన్యం నిల్వలు లేవు. వాటికి సంబంధించిన బియ్యం లేవు. ఇవ్వే కాకుండా ఆ తర్వాత కేటాయించిన ధాన్యం కొన్ని మిల్లులలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు విస్మయం చెందుతున్నారు.

**ఆ మిల్లులకు నోటీసులు జారీ..**

ఉమ్మడి జిల్లా పరిధిలో పలు మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు పలు దఫాలు తనిఖీలు చేపట్టారు. మిల్లులకు సంబంధించి తనిఖీలు చేసి వంద మిల్లులకు పైగా ధాన్యం తరుగుదల ఉన్నట్లు గుర్తించారు. ఆ మిల్లులకు నోటీసులు జారీ చేశారు. ఏళ్లు గడిచిన కొన్ని మిల్లుల యజమానులు స్పందించలేదు. ధాన్యాన్ని తిరిగి ఇవ్వలేదు. ధాన్యానికి సంబంధించిన డబ్బులను చెల్లించలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో డబ్బులు చెల్లించకపోవడం, మిల్లర్లు కోర్టుకు పోవడంతో గడిచిన 15 రోజులుగా విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు.ఆరు జిల్లాల పరిధిలో మిల్లులను తనిఖీ చేయడంతో పాటు డబ్బులు చెల్లించని మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్ని మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చిన పై స్థాయిలో అధికారులను, ప్రజాప్రతినిధులను మేనేజ్ చేస్తూ తప్పించుకుంటున్నారు. చివరకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు నిర్ణయం తీసుకోవడంతో మరికొన్ని మిల్లులపై కేసులు నమోదు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.విజిలెన్స్ శాఖ అధికారులు చేలస్తున్న తనిఖీల వల్ల వారిపైన కూడా ఒత్తిడి పెరుగుతుంది. అయినా ఒత్తిళ్ల మధ్య కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.గతంలో మిల్లర్లకు ధాన్యం కేటాయించే సమయంలో బ్యాంకు గ్యారెంటీ తీసుకునేవారు. ఏ మిల్లరయిన కస్టమ్ మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వకుంటే బ్యాంకు నిధులు జప్తు చేసేవారు. మిల్లర్లు కూడా భయంగా ఉండేవారు. నిబంధనల మేరకు బియ్యం ఇచ్చేవారు. ఎప్పుడైతే బ్యాంకు గ్యారంటీ ఎత్తివేసి రైస్ మిల్లర్ల అసోసియేషన్ గ్యారంటీ తీసుకుంటున్నారా అప్పటి నుంచి గాడి తప్పింది. మిల్లర్లు అధికార పార్టీకి దగ్గరగా ఉండటం, రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పడం వల్ల ఎగవేత పెరిగింది. అసోసియేషన్‌లో పనిచేసేవారు కొందరు కోట్ల రూపాయలు మళ్లించి రియల్ ఎస్టేట్ ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. ఇతర రంగాలకు మళ్లిస్తున్నారు. ఒత్తిళ్లు పెట్టె అధికారులను చక్రం తిప్పి బదిలీ చేయిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు అండగా ఉంటూ కోట్లు ఖర్చు పెడుతున్నారు. కేసులు తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని నిబంధనలు మార్చితే వీటన్నింటికి చెక్ పడే అవకాశం ఉంది.



## తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా కన్నడ్ ఘాట్‌లో ఓ భారీ ప్రమాదం తృటిలో తప్పింది. ఛత్రపతి శంభాజీనగర్ నుంచి సూరత్ వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయ అంచున ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వివారల్లోకి వెళితే.. బస్సు కదులుతుండగా స్టీరింగ్ సిస్టమ్‌లో అకస్మాత్తుగా లోపం తలెత్తడంతో (స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో) డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. అదుపుతప్పిన బస్సు రోడ్డు పక్కన ఉన్న వంతెన సేఫ్టీ వాల్‌ను ఢీకొట్టి, లోయ అంచున ప్రమాదకర స్థితిలో నిలిచిపోయింది. ఆ రక్షణ గోడ లేకపోతే బస్సు నేరుగా లోతున ఉన్న లోయలోకి దూసుకెళ్లేది.

**ప్రయాణికుల పరిస్థితి..**

ప్రమాద సమయంలో బస్సులో 59 మంది ఉన్నట్లు సమాచారం. బస్సు లోయ అంచున ఆగిపోవడంతో తీవ్ర భయాందోళనలకు గురైన కొందరు కిటికీల గుండా బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. చివరకు అందరూ సురక్షితంగా కిందకు దిగిపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉంది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్టీరింగ్ రాడ్ విరిగిపోయిందా లేక మరేదైనా సాంకేతిక లోపమా అన్న కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు.

# కార్మికుల భద్రత పట్టదా?



**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని రసాయన కంపెనీలు కార్మికుల, స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ పరిశ్రమలను నడుపుతున్నా పర్యవేక్షించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏదైనా భారీ ప్రమాదం జరిగి కార్మికుల శరీరాలు ఛిద్రమై, నిండు ప్రాణాలు గాల్లో కలిసినప్పుడు మాత్రమే అధికారులు హడావిడిగా రంగంలోకి దిగుతున్నారు. రెండు రోజులు దాటితే విచారణలను పక్కనపెట్టి మళ్లీ మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**హెజోలో కంపెనీలో మృత్యుఘోష..**

దోతిగూడెం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న హెజోలో లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి పెను విషాదం చోటుచేసుకుంది. నైట్ షిఫ్ట్‌లో కార్మికులు పనిచేస్తుండగా ఒక్కసారిగా రియాక్టర్ భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ ప్రమాదంలో నల్లగొండ జిల్లాకు చెందిన చెన్ను నాగిరెడ్డి(31), ఖమ్మం జిల్లాకు చెందిన నాగనబోయిన నరేష్ కుమార్(29) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. పేలుడు ధాటికి వెలువడిన విషవాయువులతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అర్ధరాత్రి భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

**నెల రోజుల వ్యవధిలోనే వరుస ప్రమాదాలు..**

ఇదే హెజోలో కంపెనీలో గత జూలై 16న కెమిస్ట్ ఆలమూరు కృష్ణారెడ్డి(43) రియాక్టర్‌లో పడి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. నెల రోజులు తిరగకముందే మళ్లీ అదే కంపెనీలో రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు బలికావడం ఇక్కడి భద్రతా లోపాలకు అద్దం పడుతోంది. షిఫ్ట్ మారే సమయంలోనే ప్రమాదాలు జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన వ్యవస్థలు నిద్రమత్తు వదలక పోవడం పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

**విష వలయంలో పల్లెలు..**

పరిశ్రమలు రాత్రివేళల్లో దట్టమైన విషవాయువులను, రసాయన జలాలను వదులుతుండడంతో భూగర్భ జలాలు విషపూరితమై పంట భూములు నాశనవవుతున్నాయి. స్థానిక ప్రజలు శ్వాసకోశ, చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా మొక్కుబడి తనిఖీల నాటకాలు ఆపి, భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాశ్వతంగా మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## కొండా చేరికపై కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్ కార్యాచరణ ఏంటనే చర్చ జోరుగా జరుగుతోంది. తనను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేస్తే ఆమె కాంగ్రెస్‌కు రాజీనామా చేసి మరో పార్టీలో చేర బోతున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ కొండా సురేఖ బీజేపీలో చేరికపై ఎంపీ డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ పార్టీలోకి రావాలా వద్దా అనేది పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇవాళ మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన డీకే అరుణ.. పలు కీలక అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్ నగర్ లోకల్ వాళ్లకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పారు. అన్ని ఎన్నికల్లో పవన్ కుమార్ రెడ్డి పనిచేశారని, కమిట్మెంట్‌తో పనిచేస్తారని పవన్ కుమార్ రెడ్డి కోసం టికెట్ అడిగినట్లు చెప్పారు.

**మంచి బాధ్యత ఇస్తారేమో?:**

బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ.. ఎవరినైనా ఒక బాధ్యత నుండి తీశారంటే దానికంటే మంచి బాధ్యత ఇస్తారేమో?.. బండి సంజయ్ జనరల్ సెక్రెటరీ గా లేరు.. మంత్రి అయ్యాక పార్టీ బాధ్యత ఉండదు. నేను ఎంపీ అయ్యాక సమయం సరిపోక కర్ణాటక ఇంచార్జిగా వదిలేశానన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలమంతా కలిసే ఉన్నామని చెప్పారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కు ఉందని ఎవరిని గద్దె దించి ఎవరిని పెడతారో? ఎవరి గద్దె ఎవరు కూల్చుతారో చూడాలన్నారు. రేవంత్ రెడ్డి అమెరికా టూర్ పై ఆంక్షల విషయంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి అన్ని తెలుసని పాస్ పోర్టుకు కూడా క్లియరెన్స్ ఉండాలన్నారు.

## ప్రియుడి మోజులో కన్న తల్లిదండ్రులను చంపిన యువతి..



**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసు అనూహ్య మలుపు తిరిగింది. ప్రియుడి మోజులో పడి కన్నతల్లిదండ్రులనే మత్తు ఇంజెక్షన్ ఇచ్చి దారుణంగా హత్య చేసిన యువతి సురేఖ, జైలు నుంచి విడుదలైన కొద్ది రోజులకే ఆత్మహత్యకు పాల్పడింది. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న సురేఖ, ఓ యువకుడిని ప్రేమించింది. తమ ప్రేమ పెళ్లికి తల్లిదండ్రులు నిరాకరించడంతో వారిపై పగ పెంచుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామంలోని తన ఇంట్లో తల్లిదండ్రులకు మత్తుమందు కలిపిన ఇంజెక్షన్ ఇచ్చి వారి ప్రాణాలు తీసింది. అనంతరం వారు అనారోగ్యంతోనే మృతి చెందినట్లు అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే విచారణలో అసలు నిజం వెలుగులోకి రావడంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.ఇటీవలే ఈ కేసులో జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన సురేఖ, తిరిగి సంగారెడ్డికి వచ్చి శాంతినగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. శనివారం రాత్రి తన తల్లిదండ్రులను పొట్టనబెట్టుకున్న ఆ మత్తు ఇంజెక్షన్‌నే తాను కూడా వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. “నా చావుకు ఎవరూ కారణం కాదు” అని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సురేఖ మృతదేహాన్ని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే, కన్నవారిని దారుణంగా హత్య చేసిన సురేఖ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు, స్వగ్రామానికి రప్పించేందుకు ఆమె కుటుంబ సభ్యులు తీవ్రంగా నిరాకరిస్తున్నారు. యువతి మృతి చెందినా పట్టించుకోని పరిస్థితుల్లో ఉన్న కుటుంబ సభ్యులను ఒప్పించి సంగారెడ్డికి రప్పించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## 100 టన్నుల స్వాధీనం

### చికెన్ వ్యర్థాలపై అధికారుల చర్యలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చికెన్ వ్యర్థాల మాఫియాపై సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు ఈరోజు (సోమవారం) సోదాలు చేశారు. వంద టన్నుల వ్యర్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చేపల చెరువు యజమానులకు చికెన్ వ్యర్థాలను విక్రయించి ఈ మాఫియా సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. చికెన్ వ్యర్థాలతో పెరిగే చేపలు తింటే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందంటూ అధికారులు హెచ్చరించారు.అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్‌లో లారీల్లో డంప్ చేస్తోండగా అధికారులు తనిఖీలు చేపట్టారు. గతంలో కేసులు నమోదైన కూడా ఈ చికెన్ మాఫియా పట్టించుకోలేదని అధికారులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఏపీలోని



చేపల చెరువు యజమానులకు ఈ వ్యర్థాలను విక్రయించి మాఫియా సొమ్ము చేసుకుంటున్నట్లు అధికారులు నిర్ధారించారు. గత నెలలోనే వందటన్నుల చికెన్ వ్యర్థాలను హెచ్ ఫాస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ అదే రీతిలో చికెన్ వ్యర్థాలను తరలిస్తోండటంతో అధికారులు సోదాలు చేసి చర్యలు చేపట్టారు.

# బ్యాంకుల సమ్మె..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వారానికి 5 రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయడంలో జరుగుతున్న జాప్యం, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్‌లో తేడాలు, పెన్షన్ సంబంధిత సమస్యలతో సహా పలు పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మెతో ప్రభుత్వ రహిత, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11 శుక్రవారం కాగా.. ఆ తర్వాత రెండు రోజులు సాధారణ బ్యాంకు సెలవులు. అలాగే సెప్టెంబర్ 14న వినాయక చతుర్థి సందర్భంగా కొన్ని రాష్ట్రాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి.తమ డిమాండ్లపై ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యాలు స్పందించకపోతే సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు మరో దేశవ్యాప్త సమ్మెతో పాటు, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని తొమ్మిది బ్యాంక్ ఉద్యోగ, అధికారుల సంఘాల సమాఖ్య అయిన యూఎఫ్‌బీయూ హెచ్చరించింది. 2024 మార్చి 8న కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం వారానికి 5 రోజుల బ్యాంకింగ్ విధానానికి ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ అంగీకరించిందని, దీనికోసం సోమవారం నుంచి శుక్రవారం వరకు పనివేళలను 40 నిమిషాలు పెంచేందుకు సిద్ధపడినా, ప్రభుత్వ స్థాయిలో ఈ ప్రతిపాదన రెండేళ్లకు పైగా పెండింగ్‌లోనే ఉండిపోయిందని యూనియన్ ప్రతినిధులు మండిపడ్డారు.ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పీఎల్ఐ స్కీమ్‌ను కూడా ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్కేల్ IV, అంతకంటే ఎక్కువ కేడర్ అధికారులకు రోజువారీ పనితీరు ఆధారంగా 365 రోజుల బేసిక్ పే వరకు ఇన్సెంటివ్స్ ఇస్తూ, దిగువ స్థాయి ఉద్యోగులకు కేవలం 15 రోజుల బేసిక్ పే పరిమితం చేయడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని స్పష్టం చేశాయి. ఈ అంశంపై చీఫ్ లేబర్ కమిషనర్ వద్ద వివాద పరిష్కార చర్చలు జరుగుతున్నప్పటికీ, ఆర్థిక సేవల శాఖ నిబంధనలను అతిక్రమించి ఆమోదం తెలపడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. వీటితో పాటు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పెన్షనర్లకు సమాన కరువు భత్యం వర్తింపజేయాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి.

# అసెంబ్లీలో విజయ్ 'సూపర్ సిక్స్'!



**తమిళనాడు :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అసెంబ్లీ వేదికగా కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ విస్తరణతో పాటు పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే రైతుల వ్యతిరేకత నేపథ్యంలో పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

**'వెట్రి పయనం' - విస్తృత ఉచిత బస్సు ప్రయాణం**

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని 'వెట్రి పయనం' పేరుతో విస్తరించారు. అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుంది. మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లోని ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్ , డీలక్స్ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య, సబర్బన్ (మోఫుసిల్), కొండ ప్రాంతాల్లో తిరిగే సాధారణ ఛార్జీల బస్సులకూ ఇది వర్తిస్తుంది. ఈ పథకానికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాల సంఖ్యపై పరిమితి గానీ ఉండదు. దీనికి ఏటా రూ. 6,000 కోట్ల అదనపు వ్యయం కానుంది.

**'అన్నపూర్ణి సూపర్ సిక్స్' - 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు**

వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉన్న సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు ఏడాదికి 3 ఉచిత ఎల్పీజీ సిలిండర్లు అందించనున్నారు. సిలిండర్ల కొనుగోలు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. 2027 పొంగల్ నుంచి ప్రారంభం కానున్న ఈ పథకానికి ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 4,000 కోట్ల భారం పడనుంది.

**పరందూర్ విమానాశ్రయం రద్దు**

రైతులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరందూర్‌లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రజలు నిరాశ్రయులు కాకుండా విమానాశ్రయ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో కొత్తగా 'టెర్మినల్-5'ను నిర్మించనున్నట్లు వెల్లడించారు.



## కోడేరు బస్టాండ్ లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల గుంపు

**కోడేరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రం లోని బస్టాండ్ లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల గుంపు, సోమవారం ఉదయం వేల కోడేరు బస్సు స్టాండ్ లోపలికి ప్రయాణికుల బదులు మేము బస్సు ఎక్కుతాం అన్నట్లుగా ఉన్న పందుల గుంపు, కోడేరు గ్రామ సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి గ్రామ సర్పంచ్ ఎన్నికల అప్పుడు కోడేరు గ్రామం నుండి పందులు సుమారు 5కిలోమీటర్లు దూరం లో ఉండేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పిన కోడేరు గ్రామ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి ఇప్పుడు కోడేరు బస్టాండ్ లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు గుంపు వెంటనే వాటిని గ్రామం నుండి బహిష్కరణ చేయాలి అని వ్యాపారస్తులు, గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు,

## పాఠశాల నిధుల్లో ఆ ఒక్క జిల్లాకే మొండిచేయి




**కోడేరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో ప్రభుత్వ పాఠశాల లో సైన్స్ ల్యాబ్ ల ఏర్పాటు కు 68 ఉన్నత పాఠశాలల్లో ప్రయోగశాల గదుల నిర్మాణానికి రూ, 17.68 కోట్లు ప్రభుత్వం కేటాయించింది, టెండర్ల ద్వారా పనులు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు, అయితే ఈ నిధుల కేటాయింపుల్లో నాగర్ కర్నూల్ జిల్లాకు రూపాయి కూడా మంజూరు కాకపోవడంపై ఆ జిల్లా ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు,

## డివిజన్ స్థాయి ప్రజావాణికి 26 ఫిర్యాదులు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయిలో పలు శాఖలకు మొత్తం 26 ఫిర్యాదులు రావడం జరిగింది. ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి సబ్ కలెక్టర్ కార్యాలయానికి 5, తహసిల్దార్ కార్యాలయం మిర్యాలగూడ కు 10, తహసిల్దార్ కార్యాలయం వేములపల్లికి 1,తహసిల్దార్ కార్యాలయం తిరుమలగిరి సాగర్ 1,తహసిల్దార్ కార్యాలయం దామరచర్ల కు 2,తహసిల్దార్ కార్యాలయం త్రిపురారం 1,తహసిల్దార్ కార్యాలయం నిడమనూరు 1, ఎంపీడీవో కార్యాలయం మిర్యాలగూడకు 2,ఎస్ డి పి ఓ కార్యాలయం మిర్యాలగూడకు 1,డి ఎల్ పి ఓ కార్యాలయం మిర్యాలగూడ కి 1,మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం కు1 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్జీదారులు పెట్టినటువంటి ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి సత్వరమే సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించామని తెలిపారు.

## నాగర్‌కర్నూల్‌లో రోడ్లకు మహర్దశ..

### రూ.146.71 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన



**ఉమ్మడి మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్‌లో రూ. 146.71 కోట్లతో చేపట్టనున్న మూడు హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారి పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, జూపల్లి కృష్ణారావు గారు శంకుస్థాపన చేశారు. వనపర్తి-1 ప్యాకేజీ కింద అచ్చంపేట ఫేజ్-1లో ఈ పనులను చేపట్టనున్నారు రూ. 32.99 కోట్లతో అమ్రాబాద్- తొల్పలపల్లి రహదారి, పదర, వాంకేశ్వరం, చిట్లముకుంట, ఉడిమిల్ల, ఇప్పలపల్లి గ్రామాల మీదుగా కిలోమీటర్ 0/000 నుంచి 34/200 వరకు రహదారిని బలోపేతం చేయనున్నారు. అదేవిధంగా రూ. 35.71 కోట్లతో బల్మూర్- నాగర్‌కర్నూల్ పీడబ్ల్యూడీ రహదారితో పాటు బల్మూర్, గోదల్, తుమ్మన్‌పేట గ్రామాల మీదుగా రహదారిని రెండు లేన్లుగా విస్తరించనున్నారు. రూ. 78.01 కోట్లతో అచ్చంపేట- రాకొండ (ఉప్పునుంతల మీదుగా) రహదారితో పాటు ఉప్పునుంతల, మొల్గర, పెద్దాపూర్, మామిళ్లపల్లి, రాకొండ గ్రామాల మీదుగా రెండు వరుసలకు విస్తరించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ విధానంలో రహదారులకు మహర్దశ



**నాగర్ కర్నూల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** హ్యామ్ (హెచ్‌ఏఎం) విధానంలో చేపడుతున్న రహదారి పనులతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రహదారుల మహర్దశ పట్టనుందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బల్మూర్‌లో రూ. 146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రహదారి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ. 7,600 కోట్ల వ్యయంతో హైదరాబాద్-శ్రీశైలం-నంద్యాల జాతీయ రహదారిలో భాగంగా మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం అచ్చంపేట నియోజకవర్గం మీదుగా వెళ్లనుందని మంత్రి తెలిపారు. దీంతో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. శంషాబాద్ నుంచి అచ్చంపేట మీదుగా బెంగళూరు వరకు బుల్లెట్ రైలు రాబోతుందని చెప్పారు.

**అచ్చంపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత వాసిగా అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జూపల్లి అన్నారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

**ఉమ్మడి పాలమూరు జిల్లాకు రూ.2,963 కోట్లు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రహదారుల నిర్మాణం, ఉన్నతీకరణ కోసం రూ. 2,963 కోట్ల నిధులుమంజూరయ్యాయని మంత్రి తెలిపారు. రహదారుల లిఅభివృద్ధికి పెద్ద-ఎత్తున నిధులు మంజూరు చేసినందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## సెప్టెంబర్ చివరి నాటికి వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి






**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వన మహోత్సవ కార్యక్రమాలపై సమీక్షించారు. రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి మనుగడను పర్యవేక్షించాలని సూచించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని, నాణ్యమైన మొక్కలనే వినియోగించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీ భూములు, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీ, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో 25.921 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 13.842 లక్షల మొక్కలు నాటి 53.40 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## నేటి నుండి సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి

### నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత చేపట్టాలి-జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్






**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నేటి నుండి సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి, నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వనమహోత్సవం పై జిల్లా కలెక్టర్లు, అటవీ, దేవాదాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫ-రెన్స్ అనంతరం నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు, గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించడం అత్యంత ముఖ్యమని, నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున మొక్కలు నాటేందుకు ఉన్న అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలని, ఇందులో భాగంగా వనమహోత్సవం కింద ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి, సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని, వన మహోత్సవం ద్వారా అటవీ కవరేజీని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు,ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లు తదితరులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని, పట్టణ ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉన్నందున అక్కడ ఎక్కువగా మొక్కలు నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విస్తృతంగా పచ్చదనం పెంచాలని, ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, దేవాలయాల్లో ప్రత్యేకమైన మొక్కలు నాటాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

### ప్రజావాణికి 186 దరఖాస్తులు



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి 186 దరఖాస్తులు స్వీకరించి, సమస్యలను పరిశీలించారు. ప్రతి వినతిపై తక్షణం స్పందించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూముల రిజిస్ట్రేషన్, భూ వివాదాలు, సెగ్రిగేషన్ షెడ్‌కు స్థలం, దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరణ తదితర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కంది భజరంగ్ ను సన్మానించిన బిజెపి నాయకులు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఫోటోగ్రఫీ రంగంలో తన ప్రతిభ చాటుకుంటూ రాష్ట్ర జాతీయ స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్. ఇటీవల ఫోటోగ్రఫీ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లోనూ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో జరిగిన పోటీలలో రెండు అవార్డులు సాధించడం ఎంతో అభినందనీయమని నల్గొండ జిల్లా బిజెపి నాయకులు అన్నారు. ఇప్పటికీ 84 అవార్డులు సాధించి జిల్లాకే ఎంతో వన్నె తెచ్చి పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,మహిళా నాయకురాళ్లు పాల్గొని భజరంగ్ ను ఘనంగా సన్మానించారు.

## మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుణ యాగం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి,పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మిర్యాలగూడ పట్టణంలోని "శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయం (శివాలయం)" లో మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో సోమవారం"సహస్ర ఘట్టాభిషేకం (వరుణ యాగం)"నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ శ్రీమల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,సహస్ర ఘట్టాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు,కుంటలు, జలాశయాలు నిండాలని, వ్యవసాయానికి అవసరమైన నీరు సమృద్ధిగా లభించి రైతులు పండించిన పంటలకు మంచి దిగుబడులు రావాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పొలాలు పచ్చని పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలో సౌకర్యాలు నిల్...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ దామరచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న ఎమ్మార్వో కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా నాయక్,వీరన్న మాట్లాడుతూ దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక సమస్యలతో విద్యా సంవత్సరం ప్రారంభం అయింది విద్యాసంస్థలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు పేద సామాజిక వర్గానికి చెందిన ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా విద్యాధికారులు ప్రభుత్వం విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ముఖ్యంగా ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థినిలకు టాయిలెట్స్ రూమ్స్ లేక అందులో వాటర్ సదుపాయం లేక మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలు గాని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో గాని విద్యార్థినిలు టాయిలెట్స్ వాష్రూమ్స్ కి వెళ్లాలి అంటే లోకల్ లో ఉన్న వారి ఇండ్లకు స్నేహితుల ఇండ్లకు వెళ్తున్నారు. గతంలో అనేక అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు ఈ ప్రభుత్వాలు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రిలే నిరాహార దీక్షలు,రాస్తారోకోలు అవసరమైతే మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను బందుకు కూడా పిలుపునిస్తామని హెచ్చరిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు జగన్,దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న నాయక్,గర్ల్స్ కన్వీనర్ ఝాన్సీ,చంటి,వంశీ,తరుణ్,పవన్,దత్తు,అభి తదితరులు పాల్గొన్నారు.



# 140 ఏళ్లలో ఇదే తొలిసారి..

ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ దారుణ ఓటమిని ఎదుర్కొంది. తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌట్ అయిన బంగ్లా.. రెండో ఇన్నింగ్స్‌లో 38.3 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు పడగొట్టి.. బంగ్లాదేశ్ పతనంతో కీలక పాత్ర పోషించారు. మొదటి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌట్ అయిన ఆసీస్.. ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో గెలిచింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మొదటి టెస్టులో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే.రెండో టెస్టులో బంగ్లాదేశ్ దారుణంగా ఓడినా.. ఆ జట్టు స్టార్ పేసర్ షరీఫుల్ ఇస్లాం చరిత్ర సృష్టించాడు. మాకే వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 15 ఓవర్లు బౌలింగ్ చేసిన షరీఫుల్ ఏకంగా 7 వికెట్లు పడగొట్టి 48 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఈ ప్రదర్శనతో ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు తీసిన తొలి లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా షరీఫుల్ అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టడం 140 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా 1886లో ఇంగ్లండ్‌కు చెందిన డిక్ బార్లో మాంచెస్టర్ టెస్టులో 7/44 గణాంకాలతో ఈ ఘనతను సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎవరూ ఈ రికార్డును అందుకోలేదు.ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసింది మాత్రం ఇంగ్లండ్ దిగ్గజం జిమ్ లేకర్. 1956 జూలైలో మాంచెస్టర్‌లో జరిగిన టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో లేకర్ ఏకంగా 10 వికెట్లు తీసి 53 పరుగులిచ్చాడు. షరీఫుల్ ఇస్లాం అద్భుత స్పెల్‌తో బంగ్లాదేశ్ బౌలింగ్ విభాగానికి అండగా నిలిచాడు. అయితే అతడు వ్యక్తిగతంగా చరిత్రాత్మక ప్రదర్శన చేసినప్పటికీ.. మ్యాచ్ ఫలితం మాత్రం నిరాశపరిచింది. మరోవైపు ఈ సిరీస్ ముగిసిన తర్వాత బంగ్లాదేశ్ టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ చరిత్ర సృష్టించింది. తాజా ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకుంది. టెస్టు ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానం కంటే పైకి రావడం ఇదే తొలిసారి. వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంకలను వెనక్కి నెట్టి బంగ్లాదేశ్ ఆరో స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం బంగ్లా 78 రేటింగ్ పాయింట్లతో కొనసాగుతోంది.

# అలా ప్రవర్తించకూడదు




శ్రీలంకతో జరిగిన కొలంబో టెస్టులో మైదానంలో సహనం కోల్పోయి లంక పేసర్ అసిథ ఫెర్నాండోతో ఘర్షణకు దిగిన భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై ఇప్పుడు ఐసీసీ చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మాటల యుద్ధం కాస్తా హెల్మెట్‌తో శారీరకంగా తాకేంత తీవ్రరూపం దాల్చడంతో ఈ అంశం ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిధిలోకి వచ్చింది. ఈ వివాదంపై భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందిస్తూ, మ్యాచ్ తదనంతర విలేకరుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. "అక్కడ శ్రీలంక ఆటగాళ్ళు ఏదో అనే ఉంటారు. ఆవేశంలో జైస్వాల్ అలా స్పందించి ఉంటాడు. కానీ, అంత దగ్గరగా ఫెర్నాండో వైపు వెళ్లి ఒంటికి తగిలేలా ప్రవర్తించి ఉండకూడదు. ఆటలోని ఆవేశంలో అలాంటివి జరిగిపోతుంటాయి" అని కోటక్ పేర్కొన్నారు.మొదటి సెషన్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్న జైస్వాల్ 45 పరుగుల వద్ద ఫెర్నాండో వేసిన లోపలికి స్వింగ్ అయిన అద్భుతమైన బంతికి బౌల్డ్ అయ్యాడు. జైస్వాల్‌ను అవుట్ చేసిన ఆనందంలో ఫెర్నాండో తీవ్రమైన మైండ్ గేమ్‌తో సెండ్ ఆఫ్ ఇచ్చాడు. వికెట్ కోల్పోయి తీవ్ర నిరాశతో పెవిలియన్ వైపు వెళ్తున్న జైస్వాల్, ఫెర్నాండో మాటలు విని ఆగ్రహంతో వెనక్కి తిరిగి వచ్చి పేసర్‌తో నేరుగా వాదనకు దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదిటిని తాకింది. వెంటనే లంక కెప్టెన్ ధనంజయ డి సిల్వాతో పాటు ఇతర ఆటగాళ్లు వచ్చి ఇద్దరినీ విడదీయడంతో వివాదం సం-స్దమనిగింది.ఐసీసీ నియమావళిలోని ఆర్టికల్ 2.12 ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లలో వేరొక ఆటగాడితో అనుచిత శారీరక స్పర్శకు దిగడం తీవ్రమైన నేరం. ఈ ఘటనపై శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్

కోచ్ ర్యాన్ వాన్ నీకెర్క్ మాట్లాడుతూ, మాటల ఘర్షణ భావోద్వేగాల తీవ్రతకు సంకేతమని, అయితే ఈ మొత్తం విషయాన్ని మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ చూసుకుంటారని స్పష్టం చేశారు. జైస్వాల్ ఈ ఘటనలో లెవెల్-1 నేరానికి పాల్పడినట్లు రుజువైతే, అతనికి మ్యాచ్ ఫీజులో 50 శాతం వరకు కోత పడే అవకాశం ఉంది. దాంతో పాటు అధికారిక హెచ్చరిక, ఒకటి లేదా రెండు డిమెరిట్ పాయింట్లు పడే ఛాన్స్ ఉంది. మ్యాచ్ రిఫరీ నివేదిక ఆధారంగా ఐసీసీ ఈ యువ ఓపెనర్‌పై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ - పుల్లెల గాయత్రి గోపీచంద్‌ల అద్భుత ప్రయాణం ముగిసింది. డిఫెండింగ్ ఛాంపియన్ల చేతిలో తీవ్రంగా శ్రమించి ఓడిన ఈ జంట, భారత్‌కు చారిత్రక కాంస్య పతకాన్ని అందించింది.

**సెమీస్‌లో పోరాడి ఓటమి..**

న్యూఢిల్లీ వేదికగా శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్, డిఫెండింగ్ ఛాంపియన్లైన చైనా ద్వయం లియు షెంగ్షు - టాన్ నింగ్ చేతిలో 21-18, 13-21, 8-21 తేడాతో ట్రీసా-గాయత్రి పరాజయం చవిచూశారు. ఈ మ్యాచ్ గంటా 11 నిమిషాల పాటు సాగింది. ఈ విజయంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో 15 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. 2011 లండన్‌లో జ్వాలా గుత్తా-అశ్విని పొన్నప్ప కాంస్యం సాధించిన తర్వాత, ఈ టోర్నీలో భారత్‌కు పతకం అందించిన తొలి మహిళా ద్వయంగా ట్రీసా-గాయత్రి చరిత్ర సృష్టించారు.


**హోరాహోరీగా సాగిన పోరు**

మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జోడీలు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. ఒక దశలో 16-18తో వెనుకబడిన భారత ద్వయం.. ఒత్తిడిని అధిగమించి, గొప్పగా పుంజుకుని వరుస పాయింట్లతో 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. భారత జోడీ వ్యూహాత్మకంగా ఆడుతూ విరామం సమయానికి 11-10తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన 49-షాట్ల సుదీర్ఘ ర్యాలీలో చైనా పాయింట్ దక్కించుకోవడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. వరుసగా 5 పాయింట్లు సాధించిన చైనా జోడీ 21-13తో రెండో గేమ్‌ను గెలుచుకుంది. మూడో రౌండ్ నిర్ణయాత్మక చివరి గేమ్‌లో చైనా క్రీడాకారిణులు పూర్తిగా ఆధిపత్యం చెలాయించారు. ఏ దశలోనూ భారత జోడీకి అవకాశం ఇవ్వకుండా 21-8తో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. గాయాల బెడదను అధిగమించి, క్వార్టర్స్‌లో నాలుగో సీడ్‌ను మట్టికరిపించి సెమీస్‌కు దూసుకొచ్చిన ఈ అన్‌సీడెడ్ భారత జంట.. పసిడి చేజారినా అభిమానుల మనసులు గెలుచుకుని కాంస్యంతో టోర్నీని ముగించింది.




# బిజినెస్

## పెరుగుతూనే ఉన్నాయి..



అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు ప్రతిరోజు పెరుగుదల నమోదు చేస్తూనే ఉన్నాయి . గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,970గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.880 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,50,300గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.800 మేర పెరిగింది.

## గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల పై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. హోటళ్లు, రెస్టారెంట్లు, టీ స్టాల్స్ తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తగ్గిన ఈ ధరలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(జులై)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**ఆగస్టు 24వ తేదీ నాటి గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50

# వంటగది బడ్జెట్‌కు బిగ్ షాక్..




దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు క్రమంగా పెరుగుతుండటంతో సామాన్యుల వంటగది బడ్జెట్‌పై భారం పెరుగుతోంది. ముఖ్యంగా చక్కెర, ఉల్లిపాయలు, పప్పుధాన్యాలు, వంట నూనెల ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది. గత వారం రోజుల్లోనే చక్కెర ధర కిలోకు రూ.7 పెరగగా, నెల రోజుల్లో రూ.17 వరకు పెరిగి ప్రస్తుతం కిలో రూ.70కు చేరింది. ఉల్లిపాయల ధరలు కూడా కిలోకు రూ.4 నుంచి రూ.5 వరకు పెరిగాయి.

**చక్కెర ధరలకు బ్రేక్ వేసేందుకు ప్రభుత్వం చర్యలు**

చక్కెర ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. మార్కెట్‌లో సరఫరాను పెంచేందుకు అక్టోబర్ 31 వరకు 10 లక్షల టన్నుల సుంకరహిత చక్కెర దిగుమతులకు అనుమతి ఇచ్చింది. అలాగే వ్యాపారులు పెద్ద మొత్తంలో నిల్వలు చేయకుండా స్టాక్ పరిమితులను విధించింది. దేశీయంగా ఉత్పత్తి పెంచేందుకు కూడా చర్యలు చేపట్టింది. కొత్త పంట అందుబాటులోకి వచ్చిన తర్వాత పండుగల సమయంలో తగినంత చక్కెర ఉండేలా అక్టోబర్ 15 నుంచే చెరకు క్రషింగ్ ప్రక్రియను ప్రారంభించాలని చక్కెర మిల్లులను కోరింది.

**చక్కెర ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?**

చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తి కారణమని కొందరు విమర్శలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆ వాదనను ఖండిస్తోంది. ప్రస్తుతం ధరలు పెరగడానికి ప్రధాన కారణం నిల్వలు తగ్గుతాయనే ఆందోళన, హోర్డింగ్ అని ప్రభుత్వం చెబుతోంది. నిల్వలను నియంత్రించేందుకు నవంబర్ 30 వరకు వ్యాపారులు గరిష్ఠంగా 400 టన్నుల చక్కెరను మా-త్రమే నిల్వ చేసుకునేలా పరిమితి విధించింది. మార్కెట్‌లో సరఫరా పెంచడం ద్వారా ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

**ఉల్లిపాయల ధరలు ఎందుకు పెరిగాయి?**

ఉల్లిపాయల ధరల్లోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. ఆగస్టు 21 నాటికి దేశవ్యాప్తంగా సగటు చిల్లర ధర కిలోకు రూ.40.79గా ఉంది. వారం రోజుల క్రితం ఇది రూ.36.56గా, నెల రోజుల క్రితం రూ.34.87గా ఉండేది. అంటే కొద్ది వారాల్లోనే కిలోకు రూ.4 నుంచి రూ.5 వరకు పెరుగుదల కనిపించింది. కొన్ని ప్రాంతాల్లో ధరలు 25 శాతం వరకు పెరిగాయి. ప్రధానంగా కొత్త ఖరీఫ్ ఉల్లి పంట మార్కెట్‌కు రావడంలో ఆలస్యం కావడం ధరల పెరుగుదలకు కారణంగా భావిస్తున్నారు. దక్షిణ భారత రాష్ట్రాల నుంచి ఖరీఫ్ ఉల్లిపాయల రాక ఆలస్యం కావడంతోపాటు, మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో రుతుపవనాల ఆలస్యం కూడా సాగుపై ప్రభావం చూపింది. అయితే ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం బఫర్ స్టాక్‌లో ఉన్న ఉల్లిపాయలను మార్కెట్లోకి విడుదల చేస్తోంది. సరఫరా పెంచడం ద్వారా ధరలను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది.

**పప్పుధాన్యాల ధరలు కూడా పెరుగుతున్నాయి**

కంది, పెసర, మినుములు, శనగ వంటి పప్పుధాన్యాల ధరలు కూడా గత నెలలో కిలోకు సుమారు రూ.1 నుంచి రూ.2 వరకు పెరిగాయి. పప్పుధాన్యాల సాగుపై రుతుపవనాల ప్రభావం పడటం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం సుమారు 35,000 హెక్టార్లు తగ్గింది. ఇందులో కంది సాగు విస్తీర్ణం ఏకంగా 1.69 లక్షల హెక్టార్లు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. రుతుపవనాలు బలహీనపడితే పప్పుధాన్యాల సరఫరా మరింత ప్రభావితమై, ధరలు ఇంకాస్త పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**వంట నూనెల ధరలకూ పెరుగుదల ప్రభావం**

వంట నూనెల ధరలు కూడా వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో పామాయిల్ ధరలు 20 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. పామాయిల్ ఉత్పత్తిలో ఇండోనేషియా కీలక దేశం కాగా, అక్కడి కరువు పరిస్థితులు ఉత్పత్తి, ధరలపై ప్రభావం చూపుతున్నాయి. భారత్ తన వంట నూనె అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. దిగుమతుల తగ్గుదల, అంతర్జాతీయ ధరల పెరుగుదల దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. దీంతో గత నెలలో వంట నూనెల ధరలు సుమారు 2 నుంచి 3 శాతం వరకు పెరిగాయి. ఆవ నూనెతో పాటు ఇతర వంట నూనెల ధరలు కూడా పెరిగాయి. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో భారతదేశానికి శుద్ధి చేసిన చమురు దిగుమతుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా పొద్దుతిరుగుడు నూనె దిగుమతులు తగ్గడం కూడా దేశీయ మార్కెట్లో వంట నూనెల ధరలపై ప్రభావం చూపుతోంది.

**వంటగది బడ్జెట్‌పై వరుస దెబ్బలు**

చక్కెర నుంచి ఉల్లిపాయలు, పప్పులు, వంట నూనెల వరకు కీలకమైన నిత్యావసర వస్తువుల ధరలు ఒకేసారి పెరగడం సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. వాతావరణ పరిస్థితులు, పంటల రాకలో జాప్యం, సాగు విస్తీర్ణం తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, దిగుమతులు వంటి అనేక అంశాలు ఈ ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం దిగుమతులు, బఫర్ స్టాక్స్, నిల్వ పరిమితులు, ముందస్తు ఉత్పత్తి వంటి చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సరఫరా పరిస్థితులు మెరుగుపడే వరకు ధరలపై ఒత్తిడి కొనసాగే అవకాశం ఉంది. దీంతో రానున్న రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఎలా మారుతాయన్నది సామాన్యులకు కీలకంగా మారింది.




## నటనను ఒక వరంగా భావిస్తాను..


గ్లామరస్ నటి రాశీ ఖన్నా, భారతీయ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి విజయవంతంగా 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. 2013లో బాలీవుడ్ చిత్రం 'మద్రాస్ కేఫ్' సినిమాతో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ అందాల భామ, ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస ఆఫర్లతో దూసుకెళ్లారు. కేవలం ఒకే భాషకు పరిమితం కాకుండా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం సినీ పరిశ్రమల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, పాన్-ఇండియా ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ విషయంపై రాశీ ఖన్నా స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. నటనను గొప్ప వరంగా భావించడం వల్లనే ఈ 13 సంవత్సరాల సుదీర్ఘ సమయం ఎంతో వేగంగా గడిచిపోయిందని ఆమె పేర్కొన్నారు. నటనపై ఉన్న ఇష్టమే తనను నిరంతరం నడిపిస్తోందని తెలిపారు. తొలి చిత్రం 'మద్రాస్ కేఫ్'ను గుర్తు చేసుకుంటే తాను నటనను కెరీర్‌గా ఎందుకు ఎంచుకున్నానో మళ్లీ స్పష్టంగా అర్థమవుతుందని, తనకు నచ్చిన కథలలో భాగమయ్యే అవకాశం దక్కడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచి ప్రోత్సహించిన ప్రతీ దర్శకుడికి, నిర్మాతకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. రాశీ ఖన్నా సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం దర్శకులు రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న 'ఫర్జీ' సీజన్ 2 సిరీస్‌లో ఆర్బీఐ ఆఫీసర్ మేఘా వ్యాస్ పాత్రలో ఆమె మళ్లీ కనిపించబోతున్నారు. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలసి నటించిన ఈ సిరీస్‌పై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో పాటు సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' అనే తమిళ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సరసన అనీస్ బాజ్మీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న కామెడీ డ్రామాలోనూ మెరిసేందుకు సిద్ధమవుతున్నారు.

## 'జోంబీ రెడ్డి' సీక్వెల్ వచ్చేస్తోంది..




'సూపర్ హీరో' తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ వచ్చింది. ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'జోంబీ రెడ్డి 2'ను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. 'జోంబీ రెడ్డి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'జాంబీ రెడ్డి: నెక్స్ట్ లెవల్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. ఎలాంటి ఏఐ టెక్నాలజీని ఉపయోగించకుండా రూపొందించిన ఈ టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. బాలీవుడ్ డైరెక్టర్ సువర్ణ వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈసారి మరింత భారీ స్థాయిలో 'జోంబీ-వర్స్'ను మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. 'బిగ్గర్, బాడర్ & బ్లడియర్' కాన్సెప్ట్‌తో గత చిత్రానికి మించిన వయోలెన్స్, యాక్షన్‌తో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'డెడ్ ఆర్ అలైవ్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం 2027లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర, షనయ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తేజ సజ్జా మరోసారి జోంబీ ప్రపంచంలోకి అడుగుపెడుతుండటంతో 'జోంబీ రెడ్డి 2'పై ఇప్పటినుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 50కి పైగా భాషల్లో 'వారణాసి'..




సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో ఎస్ఎస్ రాజమౌళి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి'. ఈ చిత్రం నుంచి తాజాగా మరో ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ సినిమా 120కి పైగా దేశాల్లో విడుదల కానున్నట్లు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రాన్ని 50కి పైగా భాషల్లో డబ్ చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఏకంగా 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులు పనిచేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగుతున్నప్పటికీ.. నటీనటుల భావోద్వేగాలు, హావభావాలు, నటనను సహజంగా ప్రేక్షకులకు చేర వేయాలంటే మానవ స్వరం, డబ్బింగ్ ఆర్టిస్టుల పనితీరే కీలకమని రాజమౌళి భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అందుకే 'వారణాసి'ని వివిధ భాషల్లోకి డబ్ చేయడానకి ఏఐపై పూర్తిగా ఆధారపడకుండా.. ఆయా భాషలకు చెందిన ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులతో వర్క్ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాల నటన, భావోద్వేగాలు మరింత ప్రభావవంతంగా చేరేలా మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. భారీ యాక్షన్, సరికొత్త మేకింగ్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు రాజమౌళి భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 120కి పైగా దేశాలు, 50కి పైగా భాషలు, 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులతో 'వారణాసి' గ్లోబల్ రిలీజ్‌పై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది.

## 'ఇరుముడి' సూపర్ సాలిడ్ కలెక్షన్స్..



మాస్ మహారాజా రవితేజ తాజాగా నటించిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. విడుదలైన తొలిరోజు నుంచే మంచి స్పందన అందుకున్న ఈ చిత్రం ప్రస్తుతం భారీగా కలెక్షన్లను నమోదు చేస్తుంది. తాజాగా రెండో రోజు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మీడియం రేంజ్ సినిమాల కలెక్షన్లను పరిశీలిస్తే 'ఇరుముడి' ఏకంగా రూ.10.28 కోట్ల వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఈ జాబితాలో 'మిరాయ్' రూ.8.25 కోట్లు, 'తండేల్' రూ.7.42 కోట్లు, 'టిల్లు స్క్వేర్' రూ.7.36 కోట్లు, 'కుబేర' రూ.7.21 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక 'ఉప్పెన' రూ.6.86 కోట్లు, 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.6.47 కోట్లు, 'హిట్ 3' రూ.6.03 కోట్లు రాబట్టాయి. ఈ లెక్కలతో చూస్తే రెండో రోజు మీడియం రేంజ్ సినిమాల విషయంలో 'ఇరుముడి' అద్భుతమైన జోష్ చూపించిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఏ స్థాయి వసూళ్లను రాబట్టి ఏ రేంజ్ విజయాన్ని అందుకుంటుందనేది ఇండస్ట్రీ వర్గాల్లో కూడా ఆసక్తిని రేపుతుంది. ఇదిలా ఉంటే 'ఇరుముడి' చిత్రంలో ప్రియ భవాని శంకర్ హీరోయిన్గా నటించగా బేబీ నక్షత్ర కీలక పాత్రలో నటించింది. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ వారు నిర్మించారు.




## 'టాక్సిక్' సెన్సార్ పూర్తి..

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ క్రైమ్ పీరియడ్ థ్రిల్లర్ 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈనెల 26న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కంప్లీట్ చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది టీమ్. ఈ మేరకు.. 'సెన్సార్: పూర్తయింది.. భాషలు: 6 (కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, ఇంగ్లీష్‌తో కలిపి ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది) కౌంట్‌డౌన్: 3 రోజులు 'డాడీ' వచ్చేస్తున్నాడు.. పరిమిత బుకింగ్‌లు ఇప్పుడు ప్రారంభమయ్యాయి.. పూర్తి స్థాయి బుకింగ్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి' అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను షేర్ చేశారు. కాగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషి కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అన్నీ అప్డేట్స్‌తో సినిమాపై భారీ అంచనాలు క్రియేట్ కాగా.. రిలీజ్‌కు ముందే బ్లాక్ బస్టర్‌ను బజ్‌ను అందుకుంటుంది.

## 19 ఏళ్ల కేరళ భామకు మిస్ యూనివర్స్ ఇండియా కిరీటం..




కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో అందాల పోటీలో సత్తా చాటి మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2026 ఆగస్టు 23న జరిగిన గ్రాండ్ ఫినాలేలో దేశవ్యాప్తంగా వచ్చిన పోటీదారులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. ప్రస్తుత మిస్ యూనివర్స్ ఇండియా 2025 మణికా విశ్వకర్మ.. కజియాకు కిరీటం తొడిగి అభినందనలు తెలియజేశారు. ఈ విజయంతో కజియా ఇప్పుడు భారతదేశం తరఫున ఇంటర్నేషనల్ గా జరిగే పోటీల్లో కూడా అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇక మిస్ యూనివర్స్ ఇండియా 2026 పోటీ కోసం కూడా దేశవ్యాప్తంగా ఆడిషన్లు, ఇంటర్వ్యూలు చాలానే నిర్వహించారు. వీటి ద్వారా మొత్తం 52 మంది ఫైనల్ లిస్ట్ కు చేరుకున్నారు. చివరి రౌండ్లలో అందం, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, భారతీయ సంస్కృతిపై అవగాహన వంటి అంశాల్లో పోటీదారులను పరీక్షించారు. ఈ అన్ని దశల్లోనూ ఆకట్టుకున్న కజియా లిజ్ మెజో చివరకు విజేతగా నిలిచారు. ఇక ఈ తుది ఫలితాల్లో తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సతావలేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. దీంతో ఈ ముగ్గురు అందాల భామలు 2026 పోటీలో టాప్ స్థానాలను సొంతం చేసుకున్నారు. ఈసారి మిస్ యూనివర్స్ ఇండియా ఫినాలేకు ప్రముఖులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 1994లో భారత్‌కు తొలి మిస్ యూనివర్స్ కిరీటాన్ని అందించిన సుష్మితా సేన్ జ్యూరీకి నాయకత్వం వహించారు. మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు సెలీనా జైట్లీ, ఊర్వశి రౌతేలా, రియా సింఘాతో పాటు ప్రజ్ఞా కపూర్, విషా లధియా, అన్నా బ్లాంకో, డాక్టర్ స్టుటి ఖరే శుక్లా తదితరులు జ్యూరీ ప్యానెల్‌లో ఉన్నారు. అయితే కజియా విజయం ఇక్కడితో ఆగిపోవడం లేదు. జాతీయ స్థాయిలో కిరీటం గెలుచుకున్న ఆమెకు ఇప్పుడు అంతర్జాతీయంగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. నవంబర్‌లో ప్యూర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీలో కజియా లిజ్ మెజో భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు. దీంతో ప్రపంచ వేదికపై తన ప్రతిభను చాటుకునే అవకాశం ఈ 19 ఏళ్ల యువతికి లభించింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**